కావలెను
విశాఖ సమాచారమ్
తెలుగు దినపత్రిక
కార్యాలయం నందు పని చేయుటకు
డిటిపి ఆపరేటర్ కావలెను.
సెల్: 9393949345

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal License No. VSP / 96/ 2021 - 23
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

Sugar Free
Fitearly
రెండుపూటలా సేవించండి.
శక్తివంతంగా జీవించండి.
వివరములకు
8247526179
డీలర్లు కావలెను.

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 297 విశాఖపట్నం, 13 సెప్టెంబరు 2023 బుధవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమం జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం ఉదయం విజయవాడ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ఓటరు జాబితా సవరణ-2024 కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. 06.01.2022 నుండి తొలగింపుల రీ-వెరిఫికేషన్, అనర్హుల ఓటర్లపై రాజకీయ పార్టీల

(మిగతా 2లో)

## శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సీఎంను ఆహ్వానించిన టీటీడీ



తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు రావాలని ముఖ్యమంత్రి జగన్‌ను డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈఓ ధర్మారెడ్డి ఆహ్వానించారు. జగన్‌కు ఆహ్వాన పత్రికతో పాటు వెంకటేశ్వరస్వామి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌ను వేద పండితులు ఆశీర్వదించారు. తిరుమలలో సెప్టెంబర్ 18 నుంచి 26 వరకు శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు.

ఇందుకు సంబంధించి టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఆగమోక్తంగా టీటీడీ పూర్తి చేసింది. కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం సంవత్సరానికి నాలుగుసార్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్స వాలు, వైకుంఠ ఏకాదశి రోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు.

మరోవైపు తిరుమలకు కాలినడక వెళ్లే మార్గంలో నిబంధనలు కొనసాగుతోన్నాయి. నడక మార్గంలో వన్యమృగాల సంచారం తగ్గేవరకు ఆంక్షలు కొనసాగుతాయని సీసీఎఫ్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. అలిపిరి నడక మార్గంలో నిఘా కొనసాతుందని చెప్పారు. నడక మార్గంలో ఎలుగు బంట్లు, చిరుత పులులు ఉన్నట్లు ట్రాప్ కెమెరా ద్వారా గుర్తించినట్లు వివరించారు. ఇంకా ఐదు చిరుతలు

(మిగతా 2లో)

## దేశంలో శరవేగంతో అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ జిల్లా ఒకటి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** దేశంలో శరవేగంతో అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ జిల్లా ఒకటని నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి. వి. ఆర్. సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక వి. ఎం. ఆర్. డి. ఎ., కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీతి ఆయోగ్ సమావేశంలో జి.వి.ఎం.సి., వి.ఎం.ఆర్.డి.ఎ., పరిశ్రమల శాఖ అధికారులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీతి ఆయోగ్ పైలెట్ సిటీలుగా ముంబాయి, సూరత్, విశాఖపట్నం మరియు వారణాసిలను గుర్తించడం జరిగిందన్నారు. విశాఖ జిల్లాలో ప్రకృతి పరంగా సహజవనరులతో పాటు రైల్వే కనెక్టవిటీ, పోర్టు కనెక్టవిటీలతో పాటు రాబోయే రోజులలో అంతర్జాతీయ విమానాశయం కూడా విశాఖ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా విజన్ ఫర్ ఆంధ్రప్రదేశ్, సిటీ అభివృద్ధి కోసం ఆర్థిక ప్రణాళికలు తదితర అంశాలపై అధికారులను అడిగి

(మిగతా 2లో)

## ఈఎన్‌సీని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గౌరవనీయులైన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్‌ని సందర్శించారు. వైస్ అడ్మ రాజేష్ పెంధార్కర్, ఎవిఎస్ఎం, విఎస్ఎం ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్ ఈఎన్‌సీ ఆయనకు స్వాగతం పలికి, ఉత్సవ గార్డ్‌ను అందజేశారు.

గౌరవనీయులైన గవర్నర్ ఈస్టర్న్ ఫ్లీట్ యొక్క స్వదేశీంగా నిర్మించబడిన గైడెడ్ మిస్సైల్ స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ శివాలిక్‌ను సందర్శించారు, ఈ సమయంలో ఓడ మరియు తూర్పు నౌకాదళం పాత్ర మరియు

(మిగతా 2లో)

## విశాఖ విమానాశ్రయంలో ఆడారి కిషోర్ కుమార్ అరెస్ట్




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ విమానాశ్రయం రన్‌వేపై పడుకుని నిరసన తెలిపారు ఆడారి. తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా సేవ్ డెమోక్రసీ నినాదం చేస్తూ నిరసన. విశాఖ విమానాశ్రయం రన్‌వేపై పడుకుని తెలుగుదేశం యువ నాయకులు, ఆడారి కిషోర్ కుమార్ నిరసన తెలియ చేశారు. రాష్ట్ర గవర్నర్ కలుగచేసుకుని న్యాయం చెయ్యాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం యువ నాయకులు, ఆడారి కిషోర్ కుమార్‌నూ విశాఖ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మిషన్ కర్షక దేవోభవ అవగాహన సదస్సులు ముగించుకుని హైదరాబాద్ నుంచి మంగళవారం సాయంత్రం ఇండిగో విమానంలో విశాఖ వచ్చారు. అదే సమయంలో గవర్నర్ నజీర్ విశాఖ పర్యటన ముగించుకుని విజయవాడ వెళ్లేందుకు విమానాశ్రయానికి వస్తున్నారు. ఈ క్రమంలోనే కిషోర్ కుమార్ సేవ్ డెమోక్రసీ అని నినాదాలు చేశారు. ఒక్కసారిగా జరిగిన ఈ సంఘటనకు పోలీసులు వెంటనే కిషోర్ కుమార్‌నూ అదుపులోకి తీసుకుని విమానాశ్రయం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** మంగళవారం ఉదయం 10 గంటలకు తూర్పుగోదావరి జిల్లా కాకినాడ రూరల్ నాయి బ్రాహ్మణ సేవా సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య కాకినాడ జిల్లా అధ్యక్షులు పొన్నాడ సత్యనారాయణ అధ్యక్షతన కాకినాడ రూరల్ సంఘ భవనంలో జరిగింది.

ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా వైయస్సార్సీపి కాకినాడ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి వర్యులు, కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, వైఎస్ఆర్సీపి నాయకులు పుల్ల కోటేశ్వరరావు ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సుందరపల్లి గోపాలకృష్ణ హాజరైనారు. ఈ సమావేశానికి సమాఖ్య జిల్లా అధ్యక్షులు పొన్నాడ సత్యనారాయణ అధ్యక్షతన నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం జరిగింది.

నూతన అధ్యక్షులుగా వాడపల్లి ముసలయ్య, ప్రధాన కార్యదర్శిగా చింతలూరు వీర వెంకట శివ ప్రసాద్, కోశాధికారిగా పైన గణేష్, ఉపాధ్యక్షులుగా తెలగ్రాపు శ్రీనివాస్, పేరూరి రాజు, జాయింట్ సెక్రెటరీగా సుందరపల్లి వీరమాణిక్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పట్నాల శ్రీనివాస్ మరియు కార్యవర్గ సభ్యులను కాకినాడ రూరల్ గౌరవ అధ్యక్షులు లంక అప్పారావు ప్రస్తుత మాజీ అధ్యక్షులు కోట ఉమా అచ్యుత రమణ సారథ్యంలో నూతన కమిటీ నిర్మాణం జరిగింది.

ఈ సందర్భంగా గౌరవ ముఖ్యఅతిధి కురసాల కన్నబాబు మాట్లాడుతూ రూరల్ నాయి బ్రాహ్మణ సంఘ భవనము అభివృద్ధిలో భాగంగా ఈరోజు భవనము చుట్టూ ప్రహరీ నిర్మాణం చేయించి ఈరోజు నుండి వాడుకలోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా రూరల్ సంఘానికి నేనెప్పుడూ అండగా ఉంటాను మీకు ఏది అవసరమైన ఎప్పుడైనా మీకు అందుబాటులో ఉంటానని తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు సుందరపల్లి గోపాలకృష్ణ మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరూ ఐకమత్యంగా ఉండాలని సంఘ పురోభివద్ధికి

(మిగతా 2లో)

## కశింకోటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి అమర్నాథ్



**కశింకోట, (విశాఖ సమాచారమ్):** గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్నాథ్ కసింకోట మండలం ఉగ్గినపాలెం గ్రామంలో పర్యటించినప్పుడు గ్రామస్తులంతా వచ్చి మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తూ ప్రభుత్వాన్ని ప్రజలకు మరింత చేరువగా చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ప్రజలు కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి అమర్నాథ్ పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.

ఈ గ్రామంలో 19.65 లక్షల రూపాయల వ్యయంతో కొత్తగా నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని, 25 లక్షల రూపాయలు వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అదే విధంగా 16 లక్షల రూపాయలు వేయడంతో నిర్మించిన అంగన్వాడి భవనాన్ని మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. అలాగే ఉగ్గినపాలెం గ్రామ ప్రజలకు తాగునీటిని అందించేందుకు అవసరమైన 19.40 లక్షల రూపాయలతో నిర్మించిన 60 కే.ఎల్ వాటర్ ట్యాంక్ ను మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. అలాగే 6.4 లక్షల రూపాయలతో నిర్మించిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అదేవిధంగా 15.2 0 లక్షల రూపాయలతో నిర్మించిన సి.సి. రోడ్లు డ్రైన్లను, మూడు లక్షల రూపాయలతో నేర్పించిన కమ్యూనిటీ హాల్ను ఆయన ప్రారంభించారు. గ్రామాల్లోని మండల ప్రాథమిక పాఠశాల భవనాన్ని 18.86 లక్షల రూపాయలతో నాడు నేడు పథకం కింద ఆధునికరించిన

(మిగతా 2లో)

## ఏయూలో యానిమల్ హౌస్ ఏర్పాటు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయంలో శాస్త్రీయ పరిశోధనలకు ఉపయుక్తంగా యానిమల్ హౌస్ ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించి ఏయూతో హైదరాబాద్‌కి చెందిన రొడెంటా బయోసర్వి సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. మంగళవారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, రొడెంట బయోసర్వి సంస్థ చీఫ్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ కె.ఆనంద్ కుమార్‌లు సంతకాలు చేసారు. విశ్వవిద్యాలయంలో ఫార్మసీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, జువాలజీతో పాటు జీవశాస్త్ర కోర్సులను అభ్యశించే పీజీ, పిహెచ్‌డి విద్యార్థులకు ఉపయుక్తంగా దీనిని ఏర్పాటుచేస్తున్నారు. ఏయూలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎలిమెంట్ భవనానికి అనుసంధానంగా దీనిని ఏర్పాటు చేయనున్నారు. నెల రోజుల్లో ఈ కేంద్రం పూర్తిస్థాయిలో సేవలు ప్రారంభించనుంది. కార్యక్రమంలో ఏయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్, డీన్ ఆచార్య కె.బసవయ్య, ఆచార్య ఈశ్వర కుమార్, గిరిజా శంకర్, శైలజ, మురళీకృష్ణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో ఇటువంటి కేంద్రం ఉండటం చాలా అరుదైన విషయమని, రెండు దశల్లో దీనిని విస్తరిస్తామని అన్నారు. ఏయూ విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా నిలవడంతో పాటు అనుబంధ కళాశాలల విద్యార్థులకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించడానికి ఉపయుక్తంగా దీనిని తీర్చిదిద్దాలని సూచించారు. దీనికి ఏయూ సంపూర్ణ

(మిగతా 2లో)

## (మొదటి పేజీ తరువాయిలు)

### ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా నిర్వహించాలి

ఫిర్యాదులు, స్థితి, ఫారం 6, 7, 8 పెండెన్సీ , ఇంటింటికి ఓటరు సర్వేలో తీసుకున్న చర్యలు , క్రమరాహిత్యాల పరిశీలన, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, ఎపిక్ కార్డుల ముద్రణ, పంపిణీ మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని అన్నారు . ఓటరు జాబితాలో పేర్ల తొలగింపు ప్రక్రియ వివాద రహితంగా నిర్వహించాలని, నిబంధనలను పకడ్బందీగా పాటిస్తూ క్షేత్రస్థాయి విచారణ తర్వాత మరణించిన వారిని, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారి పేర్లు, రెండు సార్లు నమోదు కాబడిన వాటిని గుర్తించి ఒక పేరును జాబితా నుంచి తొలగించాలని ఆయన సూచించారు.

విశాఖ జిల్లా ఓటర్ల జాబితా సవరణ-2024కు సంబందించిన ప్రగతి వివరాలను జిల్లా కలెక్టర్ డా ఏ మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. తొలగింపుల రీ-వెరిఫికేషన్, అనర్హుల ఓటర్లపై రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఫారం 6, 7, 8 పెండెన్సీ, ఇంటింటికి ఓటరు సర్వే లో తీసుకున్న చర్యలపై సీఈవోకు తెలిపారు.

ఈ వీడియో కాన్ఫరెన్సో జిల్లా నుండి కలెక్టర్ డా ఏ మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ,జిల్లా రెవిన్యూ అధికారి కె మోహన్ కుమార్, విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, భీమిలి ఆర్డీవో భాస్కర్ రెడ్డి, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సీఎంను ఆహ్వానించిన టీటీడీ

నడక మార్గంలో తిరుగుతున్నాయని వాటిని బంధించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు.

ఇప్పిటికే ఐదు చిరుతలను బంధించినట్లు వివరించారు. నడక మార్గంలో ఇరువైపుల అటవీ ప్రాంతాన్ని చదును చేసినట్లు తెలిపారు. మంగళవారం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శ్రీవారి దర్శనం కోసం భక్తులు 31 కంపార్ట్ మెంట్లలో వేచి ఉన్నారు. స్వామివారి సర్వదర్శనానికి 17 గంటల సమయం పడుతోంది. నిన్న 66,199 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

### దేశంలో శరవేగంతో అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ జిల్లా ఒకటి

తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జి.వి.ఎం .సి మున్సిపల్ కమిషనర్ సాయి కాంత్ వర్మ విశాఖ జిల్లా అభివృద్ధి ప్రణాళికలపై ఫవర్ ఫాయింట్ ప్రజంటేషన్గావించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కోస్టల్ సిటీ, సర్వీసు సెక్టర్, టూరిజం, సిటీ ప్లానింగ్, యూసీడి, ఎడ్యుకేషన్, పబ్లిక్ హెల్త్, ఈ గవర్నెన్స్ తదితర అంశాలపై సాధించిన ప్రగతి గురించి వివరించారు. అదే విధంగా నిధుల రాబడి, ఖర్చులు గురించి వివరించారు. బి.ఆర్.టి.ఎస్ నెట్ వర్క్ విశాఖ నగర వ్యాప్తంగా మంచినీటి సరఫరా యు జి డి వ్యవస్థ ఏర్పాట్ల పై నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.వి.ఆర్. సుబ్రమణ్యం కు వివరించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టుద్వారా బీచ్ రోడ్డులో శోలార్ సిస్టమ్ ద్వారా విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విదంగా జిల్లాలో పరిశ్రమల గురించి తెలియజేస్తూ స్టీల్ప్లాంట్, కోరమండల్, బి.హెచ్.పి.వి., హెచ్ .పి.సి.ఎల్, వంటి పరిశ్రమల గురించి వివరించారు. జిల్లాలో విద్యకు సంబందించి ఉన్న యూనివర్సిటీలు, నేషనల్ లా స్కూల్, మెడికల్ కాలేజీలు గురించి వివరించారు.

విశాఖపట్నం పోర్టుట్రస్ట్ చైర్మన్ యం.అంగముత్తు మాట్లాడుతూ జిల్లాలో ఎగుమతులు, దిగుమతులు పరంగా పక్క జిల్లాలైన ఒరిస్సా, తెలంగాణ, కర్ణాటకలో కొంత భాగం ఇక్కడ నుండే జరుగుతుందన్నారు. కార్గో రవాణా ఎక్కువగా చేస్తామని, జిల్లా అభివృద్ధికి తమ వంతు సహాకారం ఉంటుందని తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎ.పి.ఐ.ఐ.సి., మేనేజింగ్ డైరక్టర్ ప్రవీణ్ కుమార్, విజయవాడ నుండి పాల్గొన్నారు.

ఈ సమావేశంలో నీతి ఆయోగ్ సభ్యులు పార్ధ సారధి, జి.వి.ఎం .సి., వి.ఎం .ఆర్.డి.ఎ., పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సి.హెచ్. గణపతి, టూరిజం ఆర్ డి శ్రీనివాసరావు, సి.పి.ఓ., శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

### ఈఎన్సీని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ గవర్నర్

సామర్థ్యాలపై ఆయనకు వివరించారు. గౌరవనీయులైన గవర్నర్కి విశాఖపట్నం హార్బర్లో కూడా పడవలో పర్యటించి, నేవల్ డాక్యార్డ్లోని సౌకర్యాలను వివరించారు.

### ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

పాటుపడాలని ప్రస్తుత ప్రభుత్వంలో మన కులానికి ఎంతో మేలు జరిగిందని అనేక జీవోలు వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం లోనే మనకు అమలయ్యాయని అందుకుగాను గౌరవ శాసనసభ్యులు కన్నబాబుకి ప్రభుత్వానికి ధన్యవాదాలు కృతజ్ఞతలు ఈ సభాముఖంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కింతాడ సత్యనారాయణ, భీమనపల్లి వీరబాబు, మాచవరపు సత్యనారాయణ, స్వయంవరపు శ్రీనివాస రావు, మల్లువలస విష్ణు చక్రం, కేశనకుర్తి మహేష్, ముచ్చుమిల్లి దుర్గారావు, అల్లూరి శ్రీనివాస్, మాచవరపు రమణ, ముచ్చిమిల్లి అప్పన్న, నల్లమిల్లి శ్రీనివాస్, పాట్నూరి భద్రరావు, భీమనపల్లి జానకిరామ్, తాడి మాణిక్యాలరావు, చింతలపూడి రాము, నర్సిపూడి ప్రసాద్, గూడపువలస సత్యనారాయణ, ముచ్చిమిల్లి త్రినాథ్, మొదలగు వారు పాల్గొన్నారని కాకినాడ జిల్లా కార్యదర్శి కొమ్మన తాతారావు తెలియజేసి వందన సమర్పణ చేశారు.

### ఏయూలో యానిమల్ హౌస్ ఏర్పాటు

సహకారం, భాగస్వామ్యం అందిస్తుందన్నారు. రొడెంటా సిఎస్ఓ డాక్టర్ కె.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ నగరంలోని వివిధ పరిశ్రమల అవసరాలు తీర్చుతూ ఆదాయ వనరుగా సైతం ఈ కేంద్రం నిలుస్తుందని అన్నారు.

## ఆధునీకరించిన పోలీస్ జిమ్ ప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మంగళవారం నగర పోలీస్ కమిషనర్ డా. సి.యం త్రివిక్రమ వర్మ, ఐ.పీ.ఎస్., వారు నగర అర్మడ్ రిజర్వు ఆవరణలో గల ఆధునీకరించిన పోలీస్ జిమ్ ను, పోలీస్ కమిషనర్ కార్యాలయం సెల్లార్ వద్ద నూతనముగా ఏర్పాటు చేసిన డైనింగ్ రూమ్ను ప్రారంభించారు.

కోరమండల్, సి.ఎం.ఆర్ గ్రూప్ సంస్థలు దాతలుగా ముందుకు వచ్చి పోలీస్ జిమ్ ఆధునీకరించుటకు నిధులను విరాళామిచ్చారని, నగర పోలీసు శాఖ తరపున సీపీ వారికి కృతజ్ఞతలు తెలియజేసారు, పోలీస్ అధికారులు, సిబ్బంది నిత్యం తగిన వ్యాయామాలు చేస్తూ, ఎల్లప్పుడూ శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలనే ఉద్దేశ్యంతో పోలీస్ జిమ్ను ఆధునీకరించినట్లు సీపీ ఈ సందర్భంగా తెలియజేసారు.

ఈ కార్యక్రమంలో డి.సి.పి-1(ఎల్ & ఓ) వి.విద్యా సాగర్ నాయుడు, ఐ.పీ.ఎస్., డి.సి.పి-2(ఎల్ & ఓ) కే.ఆనంద రెడ్డి, డి.సి.పి(క్రైమ్స్) జి.నాగన్న, ఏ.డీ.సీ.పీ (అడ్మిన్) ఎం. ఆర్.కే రాజు, ఏ.డీ.సీ.పీ (ఎస్.బి) ఈ.నాగేంద్రుడు, ఏ.డి.సి.పి (ఏ.అర్) కే.సుబ్రహ్మణ్యం, ఏ.సి.పిలు, ఆర్.ఐలూ ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## డిఆర్ఎం తనిఖీ చేసిన విజయనగరం-బొబ్బిలి- సాలూరు లైన్



**విజయనగరం, (రైల్వే పీఆర్వో):** డివిజనల్ రైల్వే మేనేజర్, వాల్తేరు సౌరభ్ ప్రసాద్ మంగళవారం విజయనగరం-బొబ్బిలి-సాలూరు లైన్ను పరిశీలించారు. వాల్టెయిర్ డివిజన్లోని సీనియర్ అధికారులతో కలిసి, డిఆర్ఎం విజయ నగరం నుండి బొబ్బిలి వరకు విండో ట్రైలింగ్ తనిఖీని నిర్వహించి, ఆపై బొబ్బిలి-సాలూరు లైన్ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ సాలూరు స్టేషన్ను తనిఖీ చేసారు మరియు బొబ్బిలి - సాలూరు సెక్షన్లో రైలు సేవలను ప్రవేశపెట్టే ప్రణాళిక కోసం కస్టమర్లు మరియు గ్రామస్తులతో సంభాషించారు. స్టేషన్లోని సౌకర్యాలను పరిశీలించి, సెక్షన్లోని సౌకర్యాలపై ఆరా తీశారు. బొబ్బిలి-సాలూరు మధ్య ఇప్పటివరకు రైలు బస్సు నడుస్తోంది.

అనంతరం బొబ్బిలి స్టేషన్లోని సౌకర్యాలు, సౌకర్యాలను డీఆర్ఎం సౌరభ్ప్రసాద్ పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేయనున్న స్టేషన్ ప్రణాళికపై ఆయన చర్చించారు.

ఇంకా, డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ పార్వతీపురం స్టేషన్లో ప్రయాణీకుల సౌకర్యాలను పరిశీలించారు మరియు అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద స్టేషన్ పునర్నిర్మాణ ప్రణాళికను సమీక్షించారు. వాల్టెయిర్ డివిజన్లోని 15 స్టేషన్లలో పార్వతీపురం స్టేషన్ కూడా ఒకటి, స్టేషన్ అభివృద్ధి కార్యక్రమాల కోసం ఎంపిక చేయబడింది.

డిఆర్ఎంతో పాటు సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కోఆర్డినేషన్) శ్రీ ఎకె మోహరానా, సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి సునీల్ కుమార్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె త్రిపాఠి, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ఆపరేషన్స్) శివ ప్రసాద్ మరియు వివిధ శాఖలకు చెందిన ఇతర అధికారులు ఉన్నారు.

## (మొదటి పేజీ తరువాయిలు)

### కశింకోటలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి అమర్నాథ్

భవనాన్ని మంత్రి అమర్నాథ్ ప్రారంభించారు. ఇదిలా ఉండగా, బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి కింద ఉగ్గిపాలెం గ్రామంలోని 19 స్వయం సహాయక సంఘాల్లోని 26 మంది సభ్యులకు కోటి 90 లక్షల రూపాయల చెక్కును మంత్రి అమర్నాథ్ సభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కశింకోట మండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని చెప్పడానికి ఇప్పుడు ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాలు నిదర్శనమని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనకాపల్లి నియోజకవర్గంలో పూర్తిస్థాయి అభివృద్ధి కార్యక్రమాలకు ఆమోదం తెలిపిందని అమర్నాథ్ అన్నారు. రాష్ట్రంలో ప్రతి గ్రామాన్ని, ప్రతి నగరాన్ని పూర్తిస్థాయిలో ఆధునికరించి ప్రజల జీవన స్థితిగతులను మరింత మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలియజేశారు. ప్రజలు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మీద నమ్మకం ఉంచి తిరిగి తమ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువస్తే, ప్రజలకు ఇప్పుడు అందుతున్న సౌకర్యాలతో పాటు, మరిన్ని అదనపు సౌకర్యాలు కూడా అందే అవకాశం ఉంటుందని అమర్నాథ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు భీశెట్టి సత్యవతి, కశింకోట ఎంపీపీ కలగా లక్ష్మి గున్నాయ నాయుడు, జడ్పీటీసీ దంతులూరి శ్రీధర్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు మలసాల కిషోర్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ళ బుల్లిబాబు, గొల్లవిల్లి శ్రీనివాస రావు, వైస్ ఎంపీపీలు నమ్మి మీనా, పెంటకోట జ్యోతి, సర్పంచ్లు, ఎంపీటీసీలు, వార్డ్ మెంబెర్లు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మాజీ సైనికుల పిల్లలకు ప్రధాన మంత్రి స్కాలర్ షిప్ పథకం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** కేంద్ర సైనిక బోర్డు న్యూ ఢిల్లీ వారు ప్రధాన మంత్రి ఉపకార వేతనం మాజీ సైనికుల పిల్లలు కొరకు (మాజీ సైనికులు jco Rank కంటే తక్కువ స్థాయి కలవారు అర్హులు ) ధరఖాస్తులను 2023 2024 విద్యా సంవత్సరానికి ఆహ్వానించడమయినది.

సాంకేతిక మరియు వృతి విధ్యా కోర్సులలో చేరిన పిల్లలు (MBBS, BDS,B.TECH,MBA,MCA) మొదలగు ప్రతి విధ్యా కోర్సులలో మాత్రమే అర్హులు. ప్రధానమంత్ర ఉపకార వేతనం పొందుటకు ఇంటర్మీడియట్లో 60% మార్కులు పొంది ఉండవలెను. బాలురకు 30000/- మరియు బాలికలకు 36,000/- చొప్పున స్కాలర్షిప్ మంజూరు చేయబడును. అభ్యర్థులు కేంద్రీయ సైనిక బోర్డు న్యూ ఢిల్లీ వారు Website www.ksb.gov.inలో నవంబర్ 15 2023 లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేయగలరు.

### పంచాంగం

బుధవారం 13-09-2023
శోభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం వర్షరుతువు
శ్రావణ మాసం

**తిథి : బ. చతుర్దశి తె. 03.51**
**నక్షత్రం : మఖ రా. 02.09**
**వర్జ్యం : ప. 01.02 ల 02.46**

### తాత్కాలికంగా నిలిపివేయబడిన రైళ్ళు

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** డివైన్ రిట్రీట్ సెంటర్లోని ఆధ్యాత్మిక కార్యక్రమం కారణంగా ప్రయాణీకుల సౌకర్యార్థం, దిగువ వివరించిన విధంగా డివైన్ నగర్ వద్ద ఒక నిమిషం తాత్కాలిక స్టాపే కోసం కింది ఎక్స్ప్రెస్కు స్టాప్ను అందించాలని రైల్వే నిర్ణయించింది.

1. 12.10.2023న విశాఖపట్నం నుండి బయలుదేరే 18567 విశాఖపట్నం - కొల్లాం ఎక్స్ప్రెస్ రైలు 13.10.2023న 08.15 గంటలకు డివైన్ నగర్ వద్ద తాత్కాలికంగా ఆగుతుంది మరియు 08.16 గంటలకు బయలుదేరుతుంది.

2. 20.10.2023న కొల్లాం నుండి బయలుదేరే 18568 కొల్లాం - విశాఖపట్నం ఎక్స్ప్రెస్ రైలు 20.10.2023న 23.45 గంటలకు డివైన్ నగర్ వద్ద తాత్కాలికంగా ఆగుతుంది - 23.46 గంటలకు బయలుదేరుతుంది.

ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

దంతేవార వద్ద రైలు నం.08551/08552 & 18514/18513 యొక్క చిన్న ముగింపు

భద్రతా కారణాల దృష్ట్యా, దిగువ వివరించిన విధంగా క్రింది రైళ్ల దంతేవారాలో షార్ట్-టర్మినేట్ చేయబడతాయి.

1. 12.09.2023 నుండి 18.09.2023 వరకు విశాఖపట్నం నుండి బయలుదేరే 18514 విశాఖపట్నం-కిరండూల్ నైట్ ఎక్స్ప్రెస్ రైలు దంతేవార వద్ద ముగించబడుతుంది.

2. అదే విధంగా రైలు నెం. 18513 కిరండూల్-విశాఖపట్నం నైట్ ఎక్స్ప్రెస్ రైలు కిరండూల్కు బదులుగా 13.09.2023 నుండి 19.09.2023 వరకు దంతెవార నుండి విశాఖపట్నం వరకు ప్రారంభమవుతుంది.

3. 12.09.2023 నుండి 19.09.2023 వరకు విశాఖపట్నం నుండి బయలుదేరే 08551 విశాఖపట్నం-కిరండూల్ రైలు దంతేవార వద్ద ముగించబడుతుంది.

4. అదే విధంగా రైలు నెం. 08552 కిరండూల్-విశాఖపట్నం రైలు కిరండూల్కు బదులుగా 13.09.2023 నుండి 20.09.2023 వరకు దంతేవార నుండి విశాఖపట్నం వరకు ప్రారంభమవుతుంది.

ప్రజలు మార్పులను గమనించి తదనుగుణంగా వ్యవహరించాలని అభ్యర్థించారు.

మీ ఆరోగ్యాన్ని పటిష్టంగా ఉంచుకుంటూ.....
మరికొంతమందికి అవకాశం కల్పించండి.

● 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరికి రక్తాన్ని సక్రమంగా ప్రసరించేలా చూసుకునే అవసరం ఉంది.
● మీ రక్తం నిర్ణీత వేగంతో శరీరంలోని ప్రతీ భాగానికి అందేలా చూసుకోవాలంటే మీకు వివిధ వన మూలికలతో కూడిన ప్రత్యేక ఔషధం సేవించవలసిన అవసరం ఉంది.

కార్డోరియం ప్లస్




అలకనంద హెర్బల్స్ వారి విశిష్ట ఉత్పాదన
మన రక్త ప్రసరణను సమతుల్యం చేయడమే కాకుండా గుండెలోని రక్త నాళములు, మెదడు యందలి రక్త నాళములు మరియు శ్వాసకోశముల యందలి నాడులను దృఢంగా చేస్తుంది. వీటిలో ఉండే అడ్డంకులను త్వరితంగా అరగదీస్తుంది. ఫలితంగా మీరు గుండెపోటు, పక్షవాతం, ఉబ్బసం వంటి వ్యాధులు రాకుండా నివారించుకోగలుగుతారు. ఇప్పటికే బాధపడుతుంటే సంపూర్ణంగా జయించగలుగుతారు.

90 రోజుల కోర్సు కేవలం రూ. 2700/- మాత్రమే.
మీరు వాడండి- మిగిలిన వారిచే కూడా వాడించండి.
అందరూ ఆరోగ్యంగా ఉండండి.

అన్ని గ్రామాలలోను, పట్టణాలలోను ప్రైవేట్ ప్రాక్టీస్ నిర్వహించే ఆర్ఎంపీ, పీఎంపీ, డీఏఎంపీ, బీఏఎంఎస్, హోమియో, నేచురోపతి, ఆల్టర్నేటివ్ మెడిసిన్, బీపీటీ అర్హతలు కలిగిన వైద్యులు, సాంప్రదాయ మూలికావైద్యం చేయువారు డీలర్షిప్ కొరకు సంప్రదించండి. స్వయం ఉపాధి పథకం కింద అలకనందా ఉత్పత్తులు విక్రయించగోరువారు కూడా సంప్రదించండి.



జనహిత ట్రస్ట్(రి)
9-3-16, పిఠాపురం కోలని,
విశాఖపట్నం- 530003
ఫోన్: 8247526179
Compli

# విశాఖ సమాచారమ్

బుధవారం 13-09-2023


## నిన్న సనాతన ధర్మం నేడు ఉదయనిధి టార్గెట్ అన్నామలై?

ఇటీవల సనాతన ధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తమిళనాడు సీఎం స్టాలిన్ పుత్రరత్నం ఉదయనిధి స్టాలిన్ ఈ సారి బీజేపీ, భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీని టార్గెట్ చేసుకున్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలని దానిని నయం కాని వ్యాధులతో పోల్చి దేశవ్యాప్త దుమారానికి కారణమైన ఉదయనిధి స్టాలిన్ తాజాగా బీజేపీ పార్టీని విష సర్పంతో పోల్చాడు. తమిళనాడులో ప్రతిపక్ష అన్నాడీఎంకే పార్టీ ఆ విషసర్పాలకు ఆశ్రయం కల్పించే చెత్తలా తయారైందని మండిపడ్డారు. పాము ఇంట్లోకి ప్రవేశిస్తే దాన్ని బయటకు వెళ్లగొడితే సరిపోదనీ అది ఇంటి పరిసరాల్లోని చెత్తలో దాక్కుని అదను చూసి మళ్లీ ఇంట్లోకే వస్తుందన్నారు. ఆ చెత్తను తొలగించినప్పుడే ఆ పాము అక్కడి నుంచి వెళ్లిపోతుందని చెప్పారు. అలాగే అన్నాడీఎంకేను నిర్మూలించినప్పుడే బీజేపీ అనే విషసర్పం రాష్ట్రం నుంచి వెళ్లిపోతుందని ఉదయనిధి స్టాలిన్ చెప్పుకొచ్చారు. అలాగే ఇదే సమావేశంలో అంతకు ముందు మాట్లాడిన డీఎంకే ఎంపీ ఎ రాజా ప్రధాన మంత్రి నరేంద్రమోడీని విషసర్పంతో పోల్చారు. అందరు ఆ విషసర్పం కాటు నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుంటారని అందుకు సరైన విరుగుడు ద్రవిడమే అంటూ వ్యాఖ్యలు చేశారు.

అసలు ఉదయనిధి ఎందుకు వరుస పెట్టి బీజేపీ, సనాతనధర్మంపై విమర్శలు చేస్తున్నారు? ఆయన వ్యాఖ్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనా ఎందుకు వెనక్కు తగ్గడం లేదు? జీ-20 సమావేశాల సందర్భంగానే ఉదయనిధి మాట్లాడారనే ప్రచారం ఉంది. విదేశీ నేతలు మనదేశానికి వచ్చినప్పుడు వారి దృష్టి మరల్చేందుకే ఇలాంటి వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలున్నాయి. కానీ ఆయన టార్గెట్ జీ-20 సమావేశాలు కాదని తేలిపోయింది. కేవలం అన్నామలై టార్గెట్‌గానే ఆయన మాట్లాడుతున్నారని అర్థమైపోయింది.

గత కొన్ని దశాబ్దాలుగా తమిళనాడులో రెండు పార్టీలే రూలింగ్‌లో ఉంటూ వస్తున్నాయి. ద్రవిడ వాదాన్ని మోస్తున్న డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలే అధికారాన్ని చెలాయిస్తున్నాయి. కానీ కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక తమిళ గడ్డపై కమల వికాసం పురుడుపోసుకుంది. అన్నాడీఎంకేతో కలిసి 2019 ఎన్నికల్లో ఫలితాలను రాబట్టింది. కన్యాకుమారి, కోయంబత్తూర్ వంటి నియోజకవర్గాల్లో మంచి ఓటు బ్యాంకు సాధించింది. ఈ సమయంలో సీన్‌లోకి ఎంటర్ అయిన మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై బీజేపీకి దొరికిన ఓ ఆణిముత్యం. ద్రవిడవాదానికి సరైన సమాధానం. అధికారంలో ఉన్న డీఎంకేకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న కాషాయ లీడర్.

ప్రస్తుతం తమిళనాడులో అన్నామలై వేవ్ నడుస్తోంది. తాజాగా రాష్ట్రంలో రెండో విడత పాదయాత్ర చేస్తున్న అన్నామలైకి వస్తున్న ఆధరణ ఎలా ఉందో మొదటివిడత పాదయాత్రలోనే తెలిసొచ్చింది. ఆయన అడుగుపెట్టిన ప్రతీచోట అక్కడి స్థానికులు ఆయన్ని ఓన్ చేసుకుంటున్నారు. ఆప్యాయంగా పలకరిస్తున్నారు. చిన్నా పెద్దా అని తేడా లేకుండా ముఖ్యంగా యువత ఆయన వెంట నడుస్తోంది. తొలి విడత పాదయాత్ర సక్సెస్ కావడంతో రెండో విడత కూడా అదే లెవెల్‌లో దూసుకుపోతోంది. ఎంజీఆర్ తర్వాత ప్రజలతో మమేకమైన నేత తమిళనాడులో మరెవ్వరూ లేరు. జయలలితకు ఆ స్థాయి ఉన్నా ఆమె ఏనాడూ నేరుగా ప్రజల దగ్గరకు వెళ్లలేదు. అయితే ఇప్పుడు అన్నామలై రాష్ట్రాన్ని చుట్టేస్తున్నారు. ప్రతీ గడప గడపకూ ఆయన చేరుకుంటున్నారు. అక్కడి ప్రజల ఆలోచనా ధోరణిలో మార్పు మొదలైనట్లు స్పష్టంగా కనిపిస్తుంది.

ఇదే అధికార డీఎంకే గుండెల్లో గుబులు రేపుతోంది. అన్నామలై వేవ్‌ను తట్టుకోలేకపోతోంది. అందుకే ఆ పార్టీ నుంచి నెక్ట్స్ సీఎం అభ్యర్థి అయిన ఉదయనిధి స్టాలిన్ డైరెక్ట్‌గా అన్నామలైను టార్గెట్ చేశారు. అందులో భాగంగానే మొదట సనాతన ధర్మాన్ని, ఆ తర్వాత బీజేపీ పార్టీపై విమర్శలు గుప్పించారు. తమిళ ప్రజలు బీజేపీ వైపు మళ్లడాన్ని గుర్తించి దాన్ని తట్టుకోలేకే ఇలాంటి విపరీత వ్యాఖ్యలకు తెరతీసినట్లు తెలుస్తోంది. ఒకప్పుడు ద్రవిడ వాదానికి జై కొట్టిన తమిళులు ఇంకా దాన్నే పట్టుకువేళాడుతున్నారని అనుకోవడం అవివేకం. సరైన నాయకుడు లేక తమిళ ప్రజలకు ఆప్షన్ లేకుండా పోయింది. కానీ ఇప్పుడు అన్నామలై రూపంలో వచ్చిన ప్రత్యామ్నాయాన్ని వారెలా వదులుకుంటారు?

రేఖా. నెం. 3/2023 17-08-2023 ది. గ్రామ పంచాయితీ సరిపల్లి

**టెండరు ప్రకటన**

విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం సరిపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించి ఈ దిగువ పనులు షెడ్యూల్-1 నందు వివరించిన సీల్డ్ టెండర్లు తే. 22-08-2023న బుధవారం ఉదయం 11.00 గంటల నుండి 12.30 నిమిషాల వరకు సరిపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయము నందు పంచాయితీ కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించి అదేరోజు మధ్యాహ్నం 3.00 గంటలకు అప్పటికీ హాజరుగా ఉన్న టెండరుదారుల సమక్షమున తెరువబడును. ఆసక్తి కలవారు షెడ్యూల్ నందలి పనులకు ఎదురుగా చూపబడిన టెండరు ధరావత్తును గ్రామ పంచాయితీ కార్యాలయములో చెల్లించి రశీదు పొంది, సదరు ఒరిజినల్ రశీదును టెండరు షెడ్యూల్‌కు జతచేసి సీలు వేసిన టెండర్లను దాఖలు చేయవలెను. ధరావత్తు చెల్లించని టెండర్లు పరిగణలోకి తీసుకొనబడవు. టెండర్లు గ్రామ పంచాయితీ ఆమోదమునకు లోబడి ఖరారు చేయబడును. ఏ విధమైన కారణము చూపకనే షెడ్యూల్-1 నందలి టెండర్లను వాయిదా వేయుటకు గాని, రద్దు పరచుటకు గాని పంచాయితీ కార్యదర్శి వారికి అధికారము కలదు. ఇందుపై వివరములకు యీ కార్యాలయం పని దినములలో పనివేళలలో వచ్చి తెలుసుకొనవచ్చును.

**షెడ్యూల్-1**

| క్ర.సం | టెండరు వివరములు | ధరావత్తు మొత్తము |
|---|---|---|
| 1. | గ్రామ పంచాయితీ ఏరియాలో ప్రజారోగ్య పారిశుద్ధ్య పనులు 2023-24 సం॥లో నిర్వహణకు అవసరముగు లేబరును సరఫరా చేయుటకు మనిషికి 1కి. 1కి రేటు. | 500/- |
| 2. | గ్రామ పంచాయితీ పరిధిలో గల విద్యుత్ వీధి లైట్ల పనులు 2023-24 సం॥లో నిర్వహణకు అవసరముగు లేబరును సరఫరా చేయుటకు మనిషికి 1కి. 1కి రేటు. | 200/- |
| 3. | గ్రామ పంచాయితీ పరిధిలో గల మంచినీటి స్కీములు మరియు వీధి కొళాయిల పనులు 2023-24 సం॥లో నిర్వహణకు అవసరముగు లేబరును సరఫరా చేయుటకు మనిషికి 1కి. 1కి రేటు. | 200/- |

సం/- వి.నాగ శ్రీ సాయిప్, పంచాయితీ కార్యదర్శి, గ్రామ పంచాయితీ, సరిపల్లి.


**ఈస్ట్ కోస్ట్ రైల్వే**

టెండరు ప్రకటన నెం. eT-WAT-South-27-2023, తేదీ. 04.09.2023

**పని పేరు:** (1) సీనియర్ డివిజనల్ ఇంజనీరు/సౌత్/వాల్తేరు సెక్షన్ నందు సింహాచలం నార్తు-VSPS "A" సెక్షన్ (PQRS ఆపరేషన్‌తో) మధ్యన కి.మీ. 882.396 నుంచి 888.714 వరకు 6.318 ట్రాక్ కి.మీ పొడవు కొరకు ప్రస్తుతం 52KG PSC-12 స్లీపర్లు పైనున్న 52KG 90 UTS రైల్స్‌ను కొత్త 60KG 90 UTS రైల్స్‌తో PSC-14 స్లీపర్లు పైన పూర్తి ట్రాక్ రిన్యూవల్ (ప్రైమరీ), (2) వాల్తేరు డివిజన్ యొక్క సీనియర్ డివిజనల్ ఇంజనీరు/సౌత్/వాల్తేరు వారి పరిధిలో మెయిన్ లైనుపైన అలమండ - పెందుర్తి మధ్యన 11.826 కి.మీ పొడవునకు 25T యాక్సిల్ లోడ్ కొరకు స్పెషల్ PSC స్లీపర్లుతోటి 60KG PSC స్లీపర్లు యొక్క TSR(P) (PQRS).

**సుమారు పని విలువ:** ₹ 2,71,75,146.17. బయానా: ₹ 2,85,900/-. పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు.

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 26.09.2023న 1330 గంటలు.

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికీ అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవచ్చును మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు http://www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు/సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్) వాల్తేరు

PR-574/O/23-24


## ముగిసిన గవర్నర్ పర్యటన- ఘనంగా వీడ్కోలు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ జిల్లాలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ నాలుగు రోజుల పర్యటన ముగిసింది. ఈ నెల 8 వ తేది నుండి నాలుగు రోజుల పాటు విశాఖ జిల్లాలో పలు కార్యక్రమాల్లో గవర్నర్ పాల్గొన్నారు. మంగళవారం సాయంత్రం అయన విజయవాడకు తిరిగి బయలు దేరారు. విశాఖ జిల్లా కలెక్టర్ డా ఎ మల్లికార్జున, ఇతర అధికారులు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌కు ఘనంగా వీడ్కోలు పలికారు.

## ఇలా అయితే యుద్ధ సమయంలో కష్టమే! స్టార్‌లింక్ ఉదంతంపై అమెరికా ఆందోళన



**నేషనల్ హార్బర్:** ఉక్రెయిన్‌లో గత ఏడాది స్టార్‌లింక్ సేవలను వినియోగించుకునేందుకు స్పేస్‌ఎక్స్ వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ అనుమతినివ్వకపోడం అమెరికా రక్షణ వర్గాలను సందేహంలో పడేశాయి. ప్రైవేటు సంస్థలు, వ్యక్తులపై ఆధారపడితే యుద్ధం వంటి కీలక సమయాల్లో ఎలాంటి పరిస్థితులు తలెత్తుతాయో ఈ ఉదంతం వెలుగులోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో సైనికపరమైన ఒప్పందాల విషయంలో చాలా జాగ్రత్తగా ఉండాల్సిన అవసరాన్ని ఈ సంఘటన గుర్తుచేసిందని అమెరికా ఎయిర్ ఫోర్స్ కార్యదర్శి ఫ్రాంక్ కెండల్ తెలిపారు.

ప్రముఖ రచయిత వాల్టర్ ఐజాక్సన్ రాసిన ఎలాన్ మస్క్ జీవిత చరిత్రకు సంబంధించిన పుస్తకంలో పలు ఆసక్తికర విషయాలు ఇటీవల వెలుగులోకి వచ్చాయి. ఈ పుస్తకం నేడు అమెరికాలో విడుదల కానుంది. దీంట్లో ఉక్రెయిన్‌కు స్టార్‌లింక్ సేవలను అందించడంపై కూడా పలు ఆసక్తికర విషయాలు ఉన్నాయి. గత ఏడాది సెప్టెంబరులో సెవెస్టాపోల్ పోర్ట్‌లోని రష్యా నావికా దళానికి చెందిన నౌకలను ధ్వంసం చేసేందుకు ఉక్రెయిన్ ఎలాన్ మస్క్ సాయం కోరింది. దాడికి వీలుగా క్రిమియాలో స్టార్‌లింక్ సేవలను అందించాలని అడిగింది. దీనిని మస్క్ తిరస్కరించారు. ఈ విషయాన్ని ఇటీవల ఆయన స్వయంగా అంగీకరించారు. ప్రతిదాడిగా రష్యా అణ్వస్త్రాలను ప్రయోగించే ప్రమాదం ఉందనే ఆందోళనతోనే తాను ఆ నిర్ణయం తీసుకున్నానని వివరించారు.

ఇది జరిగిన సమయంలో ఉక్రెయిన్‌తో స్టార్‌లింక్‌కు ఎలాంటి ఒప్పందం కుదరలేదు. అప్పటికి మస్క్ ఉచితంగానే తమ సేవలను వినియోగించుకునేందుకు ఉక్రెయిన్ సైన్యానికి అనుమతి ఇచ్చారు. 2014లో రష్యా క్రిమియాను తమ అధీనంలోకి తీసుకున్న విషయం తెలిసిందే.

తర్వాత కొన్ని నెలల్లో అమెరికా ఈ విషయంలో జోక్యం చేసుకుంది. ఉక్రెయిన్‌కు నిరంతర సేవలు అందించేలా స్టార్‌లింక్‌తో ఒప్పందం కుదుర్చుకొంది. అయితే, ఇరుపక్షాల మధ్య కుదిరిన ఒప్పంద షరతులను స్టార్‌లింక్‌కు చెల్లించే మొత్తాన్ని మాత్రం అమెరికా రక్షణ కార్యాలయం పెంటగాన్ బయటకు వెల్లడించలేదు. కేవలం ఉక్రెయిన్ విషయంలోనే కాకుండా అమెరికా ఇతర విషయాల్లోనూ స్పేస్‌ఎక్స్‌పై ఆధారపడుతోంది. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో కీలక సమయాల్లో ఇలా వాణిజ్య సేవలు అందించేవారు తిరస్కరిస్తే పరిస్థితి ఏంటనేదానిపై ఆందోళన నెలకొందని కెండల్ తాజాగా వెల్లడించారు. ఫలితంగా రాబోయే రోజుల్లో సైనికపరమైన ఒప్పందాల విషయంలో ఎలా వ్యవహరించాలో చర్చిస్తున్నామని తెలిపారు.

"ఇలా ఏదైనా సైనిక కార్యాచరణను అమలు చేసే సమయంలో వాణిజ్యపరంగా సేలందించే సంస్థలు, వ్యవస్థలపై ఆధారపడాలంటే వారి నుంచి కచ్చితంగా కొన్ని హామీలు తీసుకోవాల్సి ఉంటుంది. లేదంటే వారు వారిష్టానికి వ్యవహరించే అవకాశం ఉంది. శాంతిని నెలకొల్పాల్సిన సమయంలో ఆర్థికపరమైన డిమాండ్లు తలెత్తొచ్చు. యుద్ధంలాంటి సమయంలో ఇలాంటి సేవలపై ఆధారపడడం ఏమాత్రం మంచిది కాదు" అని కెండల్ అన్నారు. కేవలం ఉక్రెయిన్ విషయంలోనే కాకుండా అమెరికా సైనిక వర్గాలు స్పేస్‌ఎక్స్‌తో ఇతర ఒప్పందాలూ కుదుర్చుకున్నాయి. యుద్ధం, విపత్తుల వంటి అత్యవసర సమయాల్లో తమ సామగ్రిని అత్యంత వేగంగా తరలించేలా ఓ రాకెట్ షిప్‌ను అభివృద్ధి చేసే నిమిత్తం అమెరికా వాయుసేనకు చెందిన 'ఎయిర్ మొబిలిటీ కమాండ్'.. స్పేస్‌ఎక్స్‌తో ఒప్పందం కుదుర్చుకుంది.

## రీసెర్చ్ ప్రాజెక్టు రిపోర్టుల విడుదల



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్రవిశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన నాలుగు పరిశోధన ప్రాజెక్టుల రిపోర్టులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మంగళవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. యూజీసీ సహకారంతో మహిళలపై జరిపిన అధ్యయన ప్రాజెక్టుల రిపోర్టులను విడుదల చేసారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, మహిళా అధ్యయన కేంద్రం సంచాలకులు డాక్టర్ పి.ఉష, సిబ్బంది డాక్టర్ టి.సాంబశివ రావు, డాక్టర్ కె.రవి కుమార్, బి.జె కిరణ్ ప్రసాద్, సి.హెచ్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## భక్తులను అలరించిన భరతనాట్యం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక గవరపాలెం శ్రీ గౌరీ పంచాయతన దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా స్పందన నృత్యాలయం విద్యార్థులచే నిర్వహించిన భరతనాట్యం భక్తులను అలరించింది. సుమారుగా 40 మంది భరతనాట్యం విద్యార్థులు భరతనాట్య కార్యక్రమంలో పాల్గొని భక్తులను ఆనందింప చేశారు. ఈ కార్యక్రమంలో స్పందన నృత్యాలయం నిర్వాహకులు. బుద్ధ స్పందన భరతనాట్య విద్యార్థుల తల్లిదండ్రులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భరతనాట్యంలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమానికి ఆలయ అధ్యక్షులు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధా రమణాజీ, కోశాధికారి కర్రీ శివ నారాయణ, ఏ.ఎల్. ఆర్. నర్సింగరావు, పెంటకోట ఉమామహేశ్వరరావు, పెంటకోట బాలకృష్ణ, అంపోలు గోపాలకృష్ణశర్మ, ఆలయ సిబ్బంది ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## తిరుమలలో ఆగమోక్తంగా ముగిసిన ప్రధాన ఘట్టం- బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం



తిరుపతి: కలియుగ వైకుంఠంగా అలరారుతోన్న ప్రఖ్యాత పుణ్యక్షేత్రం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. భక్తులు పెద్ద సంఖ్యలో తిరుమలకు చేరుకుంటున్నారు. 31 కంపార్ట్‌మెంట్లల్లో భక్తులు వేచి ఉంటున్నారు. సర్వదర్శనం టోకెన్లు ఉన్న భక్తులకు దర్శనానికి 16 నుంచి 18 గంటల సమయం పడుతోంది.

భక్తుల రద్దీకి అనుగుణంగా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం 66,199 మంది భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. వారిలో 29,351 మంది తలనీలాలను సమర్పించుకున్నారు. టీటీడీకి హుండీ ద్వారా 4.17 కోట్ల రూపాయల ఆదాయం అందింది.

ఈ నెల 18వ తేదీ నుంచి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాబోతున్నాయి. కన్నులపండువగా బ్రహ్మోత్సవాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చకచకా పూర్తి చేస్తున్నారు టీటీడీ అధికారులు. ఇందులో భాగంగా మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని ఆగమోక్తంగా పూర్తి చేశారు.

సంవత్సరంలో నాలుగుసార్లు అంటే- ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం నాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉదయం 6 నుంచి 11 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా పూర్తి చేశారు.

ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా చేశారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు.

శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు.

ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీలోని అన్ని విభాగాలు సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారి దర్శనాన్ని కల్పించడంలో సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

## స్పోర్ట్స్ క్యాలెండరు విడుదల

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** జిల్లాలోని ప్రభుత్వ మరియు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు విశాఖపట్నం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఆధ్వర్యంలో 14, 17 సంవత్సరాల వయసుగల విద్యార్థిని విద్యార్థులకు వివిధ క్రీడలను నిర్వహించడానికి ప్రభుత్వము స్పోర్ట్స్ క్యాలెండరు విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ కమీషనర్, అమరావతి వారి ఆదేశాల మేరకు నేటి నుండి అనగా 13.09.2023 నుండి 15.09.2023 వరకు మండల స్థాయి మరియు 21.09.2013 నుండి 23.09.2023 నియోజకవర్గ స్థాయి పోటీలను మండల కేంద్రాలలో నిర్ణయించిన వేదికల వద్ద 9 రకాల (కబడ్డీ, వాలీబాల్, టెన్నీ కోయిట్, కోకో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, యోగ మరియు అథ్లెటిక్స్) క్రీడలను నిర్వహిచబడునని మరియు మిగతా 32 క్రీడలను ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన 16.09.2023 నుండి 13.10.2023 వరకు వివిధ వేదికలలో నిర్వహించబడునని జిల్లా విద్యాశాఖాధికారిణి, ఎల్.చంద్రకళ తెలియజేశారు.

**మార్గదర్శకాలు:**

1. క్రీడాకారుడు తప్పనిసరిగా విద్యార్థి / విద్యార్థిని ఆమె చదువుచున్న పాఠశాలలో రెగ్యులర్ విద్యార్థి అయి ఉండాలి.
2. అండర్-14,17 సెక్రటరీలు అందరూ తప్పనిసరిగా అకడమిక్ మానిటరింగ్ యాప్ యొక్క తాజా వెర్షన్ను ఇన్స్టాల్ చేసుకోవాలని సూచిస్తున్నాము స్కూల్ గేమ్స్ లో పాల్గొనడానికి (U 14. & 17) బాలురు మరియు బాలికలు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ఫారమ్‌ను పొందడానికి యూజర్ ID మరియు పాస్వర్డ్‌గా స్కూల్ UDISE-కోడ్‌తో లాగిన్ అయ్యి పొందవలెను.
3. ఆటగాళ్ళు ఒకే కేటగిరీలో ఎన్ని ఆటలలోనైనా పాల్గొనవచ్చు.
4. 26 జిల్లాలకు AP ఇంటర్ డిస్ట్రిక్ట్ టోర్నమెంట్ నిర్వహణ కోసం కేటాయింపు జరుగును.
5. జిల్లా మరియు అంతర్ జిల్లా టోర్నమెంట్లు అన్ని పూర్వపు జిల్లాల మధ్య మాత్రమే నిర్వహించబడాలి.
6. స్కూల్ గేమ్స్ టోర్నమెంట్‌లో ఏదైనా సాంకేతిక విద్య (పాలిటెక్నిక్ మొదలైనవి) విద్యార్థులు ఇందులో పాల్గొనడానికి అర్హులు కాదు.
7. 5GFI యొక్క 44 యూనిట్లలో ప్రత్యేక నిర్వహణలో ఉన్న పాఠశాలలు వారి యూనిట్లో మాత్రమే పాల్గొనాలి, (CBSC, ICSC, KVS, NVS, విద్యా భారతి, DAV పాఠశాలలు, IBSSO, IPSC, CISCE మొదలైనవి).
8. ఇంటర్మీడియట్ క్రీడాకారులు జిల్లా స్థాయి టోర్నమెంట్లలో మాత్రమే పాల్గొనేందుకు అర్హులు, ఇంటర్మీడియట్లో పాల్గొన్న U-17 కేటగిరీలోని క్రీడాకారులు తమ కళాశాల కార్డ్ మరియు మునుపటి సంవత్సరం మార్క్ జాబితా (అసలు) సమర్పించాలి.

# మీరు కాఫీ / టీ ప్రియులా?




మన శరీరంలో కెఫిన్ ఎంత ఎక్కువగా ఉంటే, టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం అంత తక్కువగా ఉంటుందని తాజా అధ్యయనం సూచిస్తుంది.

సుమారు 9878 మంది జన్యు డేటాను విశ్లేషించిన పరిశోధకులు పై అధ్యయన ఫలితాలను ప్రచురించారు. ఈ అధ్యయనం భవిష్యత్తులో ఊబకాయం మరియు టైప్ 2 మధుమేహాన్ని తగ్గించే నాన్-కేలోరిక్ కెఫిన్ కలిగిన పానీయాల ఆవిష్కరణకు దారి తీస్తుందని కూడా భావిస్తున్నారు. అయితే, ఈ విషయంలో మరింత పరిశోధన అవసరమని కూడా వారు నొక్కి చెప్పారు.

ఈ సందర్భంలో, ఈ అధ్యయనం యొక్క ఉద్దేశ్యం ఎక్కువ కాఫీ తాగమని సిఫార్సు చేయడం కాదు అని ఎక్సెటర్ విశ్వవిద్యాలయంలో మధుమేహం మరియు స్థూల కాయంపై సీనియర్ లెక్చరర్ కటైనా ఘోస్ చెప్పారు.

**జన్యు వైవిధ్యాలు** : జన్యువుల యొక్క రెండు వైవిధ్యాల డేటా విశ్లేషణ కోసం తీసుకోబడింది. ఈ జన్యువులు కెఫిన్ జీవక్రియను నెమ్మదిస్తాయి. అందువల్ల, పైన పేర్కొన్న జన్యుపరమైన తేడాలు ఉన్నవారి రక్తంలో కెఫిన్ ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు వాదిస్తు న్నారు, కాబట్టి వారికి తక్కువ కాఫీ అవసరం. వారు పాల్గొనేవారి శరీర కొవ్వు, టైప్ 2 డయాబెటిస్ మరియు గుండె జబ్బుల ప్రమాదంపై డేటాను కూడా సేకరించారు.

జన్యుపరంగా అంచనా వేయబడిన కెఫిన్ అధిక రక్త స్థాయిలు తక్కువ శరీర ద్రవ్యరాశి సూచికతో సంబంధం కలిగి ఉన్నట్లు కనుగొనబడింది. మరియు టైప్ 2 డయాబెటిస్‌లో 43 శాతం పాజిటివ్ బ్లడ్ కెఫిన్ స్థాయిలు బరువు తగ్గడం వల్ల వచ్చినట్లు కూడా అధ్యయనం చూపించింది. అయినప్పటికీ, కెఫిన్ తీసుకోవడం మరియు గుండె ఆరోగ్యానికి మధ్య ఎటువంటి సంబంధం లేదని అధ్యయనం కనుగొంది.

**బరువు తగ్గించే కాఫీ:** ఈ అధ్యయనానికి సంబంధించి బెంగుళూరులోని ఫోర్టిస్ హాస్పిటల్ సీనియర్ ఫిజిషియన్ డాక్టర్ ఆదిత్య ఎస్ సౌతీ మాట్లాడుతూ కాఫీని మానసిక ఆరోగ్య ఉత్పత్తిగా విరివిగా వినియోగిస్తున్నారని చెప్పారు. కెఫిన్ బరువు తగ్గడానికి మరియు టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించడానికి ముడిపడి ఉందని ఆయన చెప్పారు. అయినప్పటికీ, కెఫిన్ తీసుకోవడం మరియు దాని ఆరోగ్య ప్రయోజనాల మధ్య సంబంధాన్ని నిర్ధారించ డానికి మరింత పరిశోధన అవసరమని ఆయన చెప్పారు.

**శరీరానికి ఆరోగ్యాన్ని ఇచ్చే కాఫీ:** కాఫీ యొక్క ప్రయోజనకరమైన ప్రభావాల గురించి మాట్లాడుతూ, డాక్టర్ సౌతి మాట్లాడుతూ, ప్రజలు వినియోగించే కాఫీ మొత్తాన్ని బట్టి ప్రయోజనాలు మారుతూ ఉంటాయి. అందువల్ల, వినియోగించే కాఫీ మొత్తాన్ని పర్యవేక్షించాలి. కాఫీ ఆరోగ్యానికి హానికరమైతే వెంటనే వైద్యులను సంప్రదించాలని అంటున్నారు.

అధిక రక్తపోటు లేదా గుండె జబ్బులు ఉన్నవారు జాగ్రత్తగా కాఫీ తాగాలి. ఎందుకంటే కాఫీ కొందరిలో రక్తపోటును పెంచుతుంది లేదా హృదయ స్పందన రేటును పెంచుతుంది. నిద్రపోయే ముందు కాఫీ తాగకపోవడమే మంచిదని, అది నిద్రకు భంగం కలిగిస్తుందని సౌతీ చెప్పారు.

**రోజూ కాఫీ తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు:** రోజూ కాఫీ తాగితే టైప్ 2 మధుమేహం తగ్గుముఖం పడుతుందని హైదరాబాద్ లోని యశోద హాస్పిట్‌లో జనరల్ మెడిసిన్ అండ్ డయాబెటిస్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్న వైద్యుడు రంగ సంతోష్ చెబుతున్నారు. కానీ అదే సమయంలో, ఆయన కెఫిన్ మొత్తం రోజుకు 400mg కంటే ఎక్కువ ఉండ కూడదని కూడా హెచ్చరించారు.

మనం రోజూ ఎంత కాఫీ తాగుతున్నామో పరిశీలించాలి. అదనంగా, కొంబుచా, ఎక్సెడ్రిన్, మిడోల్, చాక్లెట్, కాఫీ కలిపిన తృణధాన్యాలు, గ్రానోలా బార్లు, పెరుగు, ఐస్‌క్రీం మొదలైన కెఫీన్ ఉన్న ఇతర ఆహారాలు మరియు పానీయాల మొత్తాన్ని కూడా మనం పరిగణనలోకి తీసుకోవాలి.

# ఉల్లిపాయ - వెల్లుల్లిల్లో మన ఆరోగ్యానికి ఏది బెటర్



'ఉల్లి చేసిన మేలు తల్లి కూడా చేయదంటారు' ఊరికే రాలేదు ఆ సామెత. ఉల్లిపాయకు ఉండే చరిత్ర అలాంటిది మరి. ఇక వెల్లుల్లితో అనేక దీర్ఘకాలిక సమస్యలు సమసిపోతాయి. మన శరీరానికి ఏవి మంచివి? ఏవి తింటే ఆరోగ్యంగా ఉంటామో పురాతన కాలంలోనే పెద్దలు చెప్పేశారు. కానీ మనం వాటిని పట్టించుకోకుండా ప్రాసెస్డ్ ఫుడ్, జంక్‌ఫుడ్‌లు తింటూ అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకుంటున్నాం. ఏదో అప్పుడప్పుడు అయితే ఓకే కానీ నిత్యం వీటిపైనే ఆధార పడి ఉంటే మాత్రం చాలా డేంజర్. ఈ విషయం పక్కన పెడితే ఉల్లిపాయ-వెల్లుల్లిలో ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉన్నాయి. ఈ రెండింటిలో ఏది ఎక్కువగా తీసుకుంటే మన ఆరోగ్యం మెరుగు పడుతుంది?

**ఉల్లితో ఎన్నో బెనిఫిట్స్:** ఉల్లి పాయలో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలతో పాటు యాంటీ వైరల్ లక్షణాలు కూడా ఉన్నాయి. దీన్ని తీసుకోవడం వల్ల బ్యాక్టీరియా, ఇన్ఫెక్షన్స్ బారిన పడకుండా ఉంటాం. అలాగే ఉల్లిలో క్యాన్సర్‌ను నిరోధించే లక్షణాలు ఉన్నాయి. ఊపిరి తిత్తులు, రొమ్ము క్యాన్సర్, పెద్ద పేగు సమస్యలు, ఊబకాయం, రక్తపోటు, హైబీపీ, కొలెస్ట్రాల్, గుండె సంబంధిత సమస్యలు, గ్యాస్ట్రిక్ హైబీపీ వంటివి రాకుండా ఉంటాయి. అదే విధంగా అనియన్ తీసుకోవడం వల్ల రక్తం గడ్డకట్టకుండా ఉంటుంది. ఉల్లితో ముఖ్యంగా జుట్టు సమస్యలకు చెక్ పెట్టవచ్చు. ఆరోగ్యంగా ఉండడమే కాకుండా ఒత్తుగా పెరుగుతుంది.

**వెల్లుల్లిలో సూపర్ ప్రయోజనాలు:** ఉల్లి పాయలో ఉండే ప్రయోజనాలే వెల్లుల్లిలో కూడా ఉంటాయి. ఇది తీసుకున్నా కూడా అనేక వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. వెల్లుల్లి రెబ్బలను పరగడుపున తీసుకుంటే అనేక హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. వెల్లుల్లిని తేనెతో తీసుకుంటే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు మన సొంతం. ఇలా ఆయుర్వేద నిపుణుల సలహాలు, సూచన లు తీసుకుంటే వెల్లుల్లితో అనేక దీర్ఘకాలిక వ్యాధులకు కూడా చెక్ పెట్టవచ్చు.

అయితే ఉల్లితో పోలిస్తే వెల్లుల్లి ఎక్కువగా తీసుకోవడం వల్ల కూడా అనారోగ్య సమస్యలు వస్తాయి. దీని ఘాటు కారణంగా గుండెల్లో మంట, కడుపులో మంట, వాంతులు, అలర్జీలు, రక్త స్రావం, వికారం, విరేచనాలు, నోటి దుర్వాసన వంటి సమస్యలు వస్తాయి. కానీ ఉల్లిపాయతో ఇలాంటి సైడ్ బెనిఫిట్స్ ఏమీ ఉండవు. అయితే వెల్లుల్లిని తక్కువ మోతాదులో తీసుకుంటేనే ఆరోగ్యానికి మంచిది లేదంటే అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని అభిప్రాయ పడుతున్నారు.

# మెదడు, గుండెల ఆరోగ్యాన్ని పెంచే చాక్లెట్



కొంత మందికి చాక్లెట్స్ అంటే చాలా ఇష్టం. చిన్న వారి నుంచి పెద్ద వారి వరకూ చాక్లెట్లను ఇష్టంగా తింటారు. కొంత మంది అయితే అదే పనిగా తింటూంటారు. కానీ ఏదైనా అతిగా అయితే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అలాగే చాక్లెట్స్ కూడా మితంగా తినొచ్చు. కానీ మరీ ఎక్కువగా తినకూడదు. దీంతో ఎక్కువగా నోటి, దంత సమస్యలు తలెత్తుతాయి. కానీ వీటి వల్ల ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయండోయ్.

క్రమం తప్పకుండా ఒక చిన్న ముక్క డార్క్ చాక్లెట్ తింటే ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చు. డార్క్ చాక్లెట్‌లో కూడా మనకు మంచి చేసే పోషకాలు ఉన్నాయి. ఇందులో ఉండే విటమిన్లు, యాంటీ యాక్సిడెంట్లు, ఖనిజాలు శరీరానికి ఎంతో హెల్ప్ చేస్తాయి. అయితే ఈ డార్క్ చాక్లెట్‌ను ఎలా తీసుకోవాలి?

**మెదడు ఆరోగ్యం:** డార్క్ చాక్లెట్ తినడం వల్ల జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు మెదడు చురుకుగా పని చేస్తుంది. ఈ చాక్లెట్‌లో ఉండే ఫ్లవనాయిడ్స్ మెదడు ఆరోగ్యంలో కీలక పాత్రపోషిస్తాయి. మెదడు కణాలు దెబ్బతినకుండా చూస్తాయి.

**డయాబెటీస్ అదుపులోకి వస్తుంది:** అదేంటి చాక్లెట్ తీపి కదా? తింటే డయాబెటీస్ పెరుగుతుంది అని అనుకుంటున్నారా? అయితే డార్క్ చాక్లెట్ మాత్రం రక్తంలోని షుగర్ స్థాయిలను తగ్గిస్తుంది. అలాగే తరచూ తింటూ ఉంటే టైప్-2 డయాబెటీస్ రాకుండా బాగా ఉపయోగపడుతుందని అంటున్నారు నిపుణులు.

**చర్మానికి రక్షణగా:** డార్క్ చాక్లెట్ చర్మ రక్షణకు చాలా బాగా పని చేస్తుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు స్కిన్ హెల్దీగా ఉండేలా చూస్తుంది. అలాగే డార్క్ చాక్లెట్ తినడం ఇష్టం లేని వారు ఫేస్ ప్యాక్ గా కూడా వేసుకోవచ్చు. ఇలా చేస్తే ముఖంపై ఉన్న మృత కణాలు తొలగిపోతాయి. అలాగే ఇందులో అధికంగా ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి కనుక యూవీ కిరణాల నుంచి కూడా చర్మాన్ని రక్షిస్తుంది.

**మూడ్‌ని మార్చుతుంది:** ఒక్కోసారి మనం చాలా ఆందోళనకు గురి అవుతూ ఉంటాము. వర్క్ టెన్షన్ లేదా ఇంట్లోని ఇబ్బందుల కారణంగా సతమతమవుతూ ఉంటాము. మనసు చికాకుగా అనిపిస్తుంది. ఇలాంటి సమయంలో డార్క్ చాక్లెట్ తింటే తేలికగా అనిపిస్తుంది. ఈ చాక్లెట్ ఎండార్ఫిన్స్ ఉత్పత్తిని చేస్తాయి. వీటి కారణంగా వెంటనే మూడ్ మారి, యాక్టీవ్‌గా అవుతారు.

**గుండె ఆరోగ్యంగా ఉంటుంది:** డార్క్ చాక్లెట్ తినడం వల్ల గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్త ప్రసరణను మెరుగు పరుస్తుంది. దీని వల్ల రక్త పోటు వచ్చే రిస్క్ తగ్గుతుంది. అలాగే రక్త నాళాలు మెరుగ్గా పని చేస్తాయి. క్రమం తప్పకుండా డార్క్ చాక్లెట్‌ను ఓ చిన్న ముక్క తింటే గుండె జబ్బులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది.

# స్త్రీలు 25 ఏళ్ల వయసు వచ్చాక ఈ ఆహారాలు తప్పక తీసుకోవాలి



ఆడ పిల్లలు కౌమార దశలో ఆరోగ్య ఆహారం తీసుకోకుంటే జీవితాంతం అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. ముఖ్యంగా 25 ఏళ్ల వయస్సులో చదువు, వృత్తి, వివాహం మొదలైనవన్నీ వారి జీవితంలో ముఖ్యమైన భాగంగా మారతాయి. ఈ వయసులో కొందరు అమ్మాయిలు మాస్టర్స్ డిగ్రీ చదివితే, మరికొందరేమో ఉద్యోగాలు చేస్తుంటారు. మరికొందరు పోటీ పరీక్షలకు సిద్ధమవుతుంటారు. బిజీ లైఫ్‌లో పోషకాహారానికి దూరం అవుతుంటారు. ఈ వయసులో అమ్మాయిల ఆరోగ్యాన్ని మంచి స్థితిలో ఉంచడానికి, హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడానికి, ఎనర్జిటిక్‌గా ఉండటానికి పోషకాహారం తీసుకోవాలి. పీరియడ్స్, మూడ్ స్వింగ్స్ నుంచి కూడా రక్షిస్తుంది. అమ్మాయిల ఆరోగ్యం పదిలంగా కాపాడుకోవడానికి 25 ఏళ్ల తర్వాత ఏయే ఆహారం తీసుకోవాలో పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు.

**ఆరోగ్యకరమైన కార్బోహైడ్రేట్లు:** కార్బోహైడ్రేట్లు శక్తిని ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. స్త్రీలలో కండరాల కంటే కొవ్వు కణాలు ఎక్కువగా ఉంటాయి. దీని కారణంగానే వారు బరువు త్వరగా పెరుగుతారు. శారీరక శ్రమ చేసేవారిలో కొవ్వు వేగంగా పెరగదు. శరీరాన్ని శక్తివంతంగా ఉంచడానికి కాంప్లెక్స్ పిండి పదార్థాలు తీసుకోవాలి. కాంప్లెక్స్ పిండి పదార్థాలు తృణధాన్యాలు, వోట్స్, హోల్ వీట్ పాస్తాలో సమృద్ధిగా ఉంటాయి.

**ఆరోగ్యకరమైన కొవ్వులు:** శరీరానికి ఆరోగ్యకరమైన కొవ్వు కూడా అవసరం. అసంతృప్త కొవ్వు ఆరోగ్యకరమైనదిగా పరిగణించబడుతుంది. సాల్మన్ ఫిష్, బాదం, వాల్‌నట్స్, ఇతర నట్స్, ఆలివ్ ఆయిల్, ఫిష్ ఆయిల్‌లో అసంతృప్త కొవ్వులు ఉంటాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు తీసుకోవడం వల్ల శరీరంలో సెరొటోనిన్ అనే హ్యాపీ హార్మోన్ స్థాయి పెరుగుతుంది. ఇది మనసు సంతోషంగా ఉండేలా చేస్తుంది. దీనితో పాటు రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. ఎముకల నొప్పిని నివారిస్తుంది.

**ప్రొటీన్:** శరీరంలోని కండరాలను పెంచేందుకు ప్రొటీన్లు చాలా మేలు చేస్తాయి. అంతేకాకుండా జుట్టు, గోళ్ల పెరుగుదలలో ప్రొటీన్ కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కాబట్టి ఆడపిల్లలు ప్రొటీన్ ఫుడ్స్ తీసుకోవాలి. మాంసకృత్తులు తినడం వల్ల ఎముకల పటుత్వం పెరగడంతో పాటు శరీరానికి బలం చేకూరుతుంది. గుడ్లు, చీజ్, చికెన్, కాయధాన్యాలు, సోయా ముక్కలు మొదలైనవాటిలో ప్రొటీన్లు అధికంగా ఉంటాయి.

**ఐరన్:** సాధారణంగా అమ్మాయిలలో పీరియడ్స్ కారణంగా ఐరన్ లోపం ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి వారు ఐరన్ రిచ్ ఫుడ్స్ తీసుకోవాలి. బీట్‌రూట్, ఉసిరి, పాలకూర, దానిమ్మ వంటి వాటిల్లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది.

**ఫైబర్:** ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. సగానికి పైగా వ్యాధులు జీర్ణక్రియ సరిగా జరగకపోవడం వల్లనే వస్తాయి. చాలా మంది పచ్చి కూరగాయలు లేదా సలాడ్ తినడం ఇష్టపడరు. అయితే మీ ఆరోగ్యం బాగుండాలంటే పచ్చి కూరగాయలను తప్పకుండా తినండి. ఆడపిల్లల ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన ఫైబర్ వీటిలో చాలా ఉంటాయి.

# కేవలం 10 రోజుల్లో శరీర బరువు తగ్గించే జీలకర్ర - సోంపు మిశ్రమం



బరువు ఎలా తగ్గాలి అని అడిగితే అందరు ఇచ్చే సలహా ఎక్కువగా సార్లు తక్కువ మోతాదులో తినాలి మరియు తాగాలి అని. కానీ సహజ సిద్ధంగా బరువు తగ్గాలంటే సహజసిద్ధమైన డిటాక్స్ డ్రింక్స్ శరీరంలోని అధిక బరువుని తగ్గిస్తాయి. ఈ విషయం మీకు తెలియదా? తెలియకపోతే ఈరోజు తెలుసుకోండి.

సరైన డైట్‌ని అనుసరించే వరకు శరీరంలోని కొవ్వు అస్సలు తగ్గదు. శరీర బరువును నిజంగా తగ్గించుకోవాలి అనుకునే వారు మరియు అందంగా, స్లిమ్‌గా అవ్వాలి అనుకునే వారు ప్రతిరోజు జీలకర్ర - సోంపు కలిపిన నీటిని తాగాలి. ఇది శరీరాన్ని డిటాక్స్ చేసే జ్యూస్ మరియు పూర్తిగా సహజమైనది. ఈ జ్యూస్ తాగి చాలా మంది తమ శరీర బరువు తగ్గించుకున్నారు.

ఈ జీలకర్ర - సోంపు జ్యూస్ వల్ల కలిగే ప్రయోజనాల గురించి తెలుసుకుందాం.

**జీవక్రియని మెరుగుపరుస్తుంది:** జీవక్రియ లేదా మెటబాలిజం అనేది మన శరీరం యొక్క ఒక రసాయన ప్రక్రియ. శరీర బరువు తగ్గడానికి లేదా పెరగడానికి ఇదే ముఖ్య కారణం. ఎందుకంటే ఇది శరీరంలోని కెలోరీలను వేగంగా తగ్గించడంలో సహాయపడుతుంది. రోజు మంచి అల్పాహారం, భోజనం తీసుకోవడం వల్ల జీవక్రియ స్థాయి సాధారణంగా ఉంటుంది. దీని ద్వారా కేలరీలను తగ్గించుకోవడంలో ఉపయోగపడుతుంది. జిమ్ యాక్టివిటీస్, సైక్లింగ్ మరియు వాకింగ్ చేయడం ద్వారా బరువు తొందరగా తగ్గుతారు.

**జీర్ణ వ్యవస్థ:** మెరుగైన జీర్ణ క్రియ వ్యక్తి యొక్క ఆరోగ్య స్థితిని తెలియజేస్తుంది. బరువుని తగ్గించుకోవడానికి పరిమితంగా ఆహారాన్ని తీసుకోవడం, జీర్ణక్రియని మెరుగుపరచుకోవడం ఎంతో అవసరం. ఎందుకంటే తిన్న ఆహారం జీర్ణక్రియ సహాయంతో శరీరం అంతటా శక్తి రూపంలో వ్యాపిస్తుంది. మెరుగైన జీర్ణక్రియ వల్ల శరీరంలో రక్త స్థాయి స్థిరంగా ఉండటమే కాకుండా రక్తపోటు మరియు బరువు నియంత్రణలో ఉంటాయి.

**శరీరాన్ని డిటాక్స్ చేయడం:** ఉదయం లేవగానే సహజ సిద్ధమైన పండ్ల రసాలను తాగడం ఎంతో అవసరం. ఎందుకంటే అవసరం కంటే ఎక్కువగా ఆహారాన్ని తీసుకుంటే మన శరీరంలో జీర్ణక్రియ తగ్గుతుంది. దీని వల్ల శరీరంలో వ్యర్థాల నిల్వ జరిగి శరీర బరువు పెరుగుతుంది. ఈ ప్రక్రియ జరిగే సమయంలో రక్తం మురికిగా మారుతుంది. దీని వల్ల చర్మ సమస్యలు మరియు అనేక వ్యాధులు కలిగే ప్రమాదం ఉంటుంది. కావున శరీరాన్ని డిటాక్స్ చేస్తూ ఉండడం మంచిది.

# జుట్టును వేగంగా పెంచే మందారం, ఉసిరికాయ





నేటి జీవనశైలి సమస్యల్లో జుట్టు రాలడం చాలా పెద్ద సమస్య. మారుతున్న వాతావరణం మరియు వేగవంతమైన జీవనశైలితో, జుట్టు సంరక్షణలో కొన్నిసార్లు వెనకబడుతున్నాం.

మనకు జుట్టు ఎక్కువగా రాలడం ప్రారంభమైనప్పుడు, జుట్టు సంరక్షణపై ఎక్కువ శ్రద్ధ చూపుతాము. కాబట్టి, మీ తల నుండి వెంట్రుకలన్నీ రాలిపోయే వరకు వేచి ఉండకుండా, వెంటనే జాగ్రత్తలు తీసుకోవడానికి ఇది ఉత్తమ సమయం.

జుట్టు రాలడాన్ని నివారించడానికి అనేక చికిత్సలు మరియు మందులు అందుబాటులో ఉన్నప్పటికీ, అద్భుతాలు చేసే కొన్ని ఇంటి నివారణలు ఉన్నాయి. అటువంటి ప్రభావవంతమైన నివారణలలో ఒకటి మందారం మరియు ఉసిరి నూనె మిశ్రమం. పురాతన కాలంలో జుట్టు సంరక్షణలో ఈ పదార్థాలు ముఖ్యమైనవి.

ఇప్పుడు కూడా కొబ్బరి నూనెతో ఈ రెండు పదార్థాలను కలిపి ఉపయోగించడం అత్యంత ప్రజాదరణ పొందిన జుట్టు సంరక్షణ ఉత్పత్తి. జుట్టు రాలడానికి ఈ శక్తివంతమైన హెయిర్ ఆయిల్‌ను ఎలా తయారు చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.

**మందార మరియు ఉసిరి నూనె:** జుట్టు రాలడాన్ని నిరోధించడానికి మందార మరియు ఉసిరికాయ నూనెలో శక్తివంతమైన లాభాలు దాగి ఉన్నాయి. ఈ శక్తివంతమైన కలయిక జుట్టు పెరుగుదలను ఎలా ప్రోత్సహిస్తుందో మరియు ఫోలికల్స్‌ను ఎలా బలోపేతం చేస్తుందో తెలుసుకుందాం.

**కావాల్సినవి:** 1 కప్పు ఎండిన మందార పువ్వులు, 1 కప్పు తాజా లేదా ఎండిన అమ్లా (భారతీయ ఉసిరికాయ), కొబ్బరి నూనె 2 కప్పులు.

**తయారీ:** బాణలిలో కొబ్బరి నూనె పోసి, అది కరిగే వరకు తక్కువ వేడి మీద వేడి చేయండి. ఎండు మందార పువ్వులు, ఉసిరికాయలను కొబ్బరినూనెలో కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని మిక్స్ చేస్తూ సుమారు 20 నిమిషాలు తక్కువ వేడి చేయండి.

20 నిమిషాల తరువాత, పాన్‌ను వేడి నుండి తీసివేసి, మిశ్రమాన్ని చల్లబరచండి. చల్లారిన తర్వాత మందార పువ్వులు మరియు ఉసిరియకాయలను వడకట్టి చల్లార్చి నూనెను శుభ్రమైన బాటిల్ లేదా డబ్బాలో నింపండి. మందార మరియు ఉసిరి నూనె ఇప్పుడు ఉపయోగించడానికి సిద్ధంగా ఉంది.

**ఈ నూనెను ఎలా ఉపయోగించాలి?** నూనెను మీ తలకు మరియు జుట్టుకు అప్లై చేసి కొన్ని నిమిషాల పాటు సున్నితంగా మసాజ్ చేయండి. లోతైన కండిషనింగ్ కోసం కనీసం 30 నిమిషాలు లేదా రాత్రిపూట నూనెను తలకు రాయండి.

తరువాత, తేలికపాటి షాంపూతో గోరువెచ్చని నీటితో మీ జుట్టును బాగా కడగాలి. మంచి ఫలితాలను పొందడానికి వారానికి 2-3 సార్లు ఈ విధానాన్ని పునరావృతం చేయండి.

**మందార మరియు ఉసిరి ఆయిల్ ప్రయోజనాలు:**

**జుట్టు పెరుగుదలను ప్రేరేపిస్తుంది:** మందార మరియు ఉసిరికాయ నూనెలో అవసరమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఇది జుట్టు మూలాలను ప్రేరేపిస్తుంది మరియు ఆరోగ్యకరమైన జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

**జుట్టు రాలడాన్ని నివారిస్తుంది:** మందార మరియు గూస్‌బెర్రీ ఆయిల్‌లోని సహజ ప్రోటీన్లు హెయిర్ షాఫ్ట్‌ను బలోపేతం చేస్తాయి, చివర్లు చిట్లడం మరియు చీలిపోవడం తగ్గిస్తాయి.

**తలకు పోషణ:** ఈ నూనెలలోని విటమిన్లు మరియు మినరల్స్ స్కాల్ప్‌కు పోషణను అందిస్తాయి, మొత్తం జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి మరియు చుండ్రును తగ్గిస్తాయి.

జుట్టును మృదువుగా చేస్తుంది: మందార మరియు గూస్బెర్రీ నూనె మీ జుట్టును మృదువుగా, మృదువుగా మరియు నిర్వహించగలిగేలా చేస్తుంది.

# ఆవుకోసం పులిని చంపిన రైతు



తమిళనాడులో వెలుగులోకి వచ్చింది. తన ఆవు కోసం పులిని చంపేశాడు ఒక రైతు. మృతిచెందిన పులుల కళేబారాలను పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు అసలు విషయం తెలుసుకుని షాకయ్యారట. అసలు ఏమిటీ ఆవు - పులి - రైతు కథ!

వివరాల్లోకి వెళ్తే తమిళనాడులోని నీలగిరి జిల్లాలో ఫారెస్ట్ అధికారులకు రెండు పులుల మృతదేహాలు కనిపించాయి. అయితే వాటిలో ఒకదానిపై గాయాలు ఉండగా మరోదానిపై మాత్రం ఎటువంటి గాయాలు లేవు. నీటి కుంటలో కనిపించిన ఈ రెండు పులుల వయసు మూడు, ఎనిమిదేళ్లు అని అధికారులు చెబుతున్నారు.

దీంతో వీటి మృతికి కారణం ఏమిటా అనే పరిశోధనలో ఉన్న ఫారెస్ట్ అధికారులకు ఈ పులులు మృతి చెందిన కాస్త దూరంలో ఒక ఆవు కళేబారం కనిపించింది. దీంతో ఈ పులులతో పాటు, ఆ ఆవు కళేబారాల నుంచి నమూనాలను సేకరించిన అధికారులు ఫోరెన్సిక్ టెస్ట్‌కు పంపించారు.

అయితే ఆ టెస్టులో ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఆవు కళేబారం మొత్తం విషంతో నిండి ఉందని, ఆ విషపూరితమైన ఆవు కళేబరాన్ని తినడంతో పులులు చనిపోయాయని అధికారులు ధ్రువీకరించారు. దీంతో ఒక శాఖాహారి అయిన ఆవు, మరో మాంసాహారి అయిన పులులు ఒకే విషం వల్ల ఏలా చనిపోయి ఉంటాయనే ఆలోచనకు వచ్చారట అధికారులు!

దీంతో ఆ ఆవు యజమానికి అదుపులోకి తీసుకున్నారు అటవీశాఖ అధికారులు. అనంతరం తమదైన శైలిలో విచారించేసరికి అసలు విషయం బయట పెట్టాడంట.

ఆ ఆవు యజమాని వివరణ ప్రకారం 10 రోజుల క్రితం తన ఆవు తప్పిపోయిందంట. దాన్ని వెతుకుతున్న క్రమంలో కాస్త దూరంలో ఆ ఆవు మృతిచెంది కనిపించిందట. దీంతో తన ఆవుని పులే చంపి ఉంటుందని బలంగా భావించిన ఆ రైతు పులిపై ఎలాగైనా ప్రతీకారం తీర్చుకోవాలని ఫిక్సయ్యాడంట. ఇందులో భాగంగానే ఆ ఆవు కళేబారానికి విషం పూశాడట.

దీంతో ఆ ఆవు కళేబరాన్ని తినడం వల్లే ఈ రెండు పులులలో ఒకటి మరణించి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. చనిపోయినవాటిలో ఒక పులి శరీరంపై ఎటువంటి గాయాలు కనిపించకపోగా మరొకటి గాయపడినట్లు అధికారులు తెలిపారు. దీంతో చిన్న పులిని పెద్ద పులి గాయపరిచి చంపేసి ఉంటుంది. పెద్ద పులేమో ఆవు కళేబారాన్ని తిని చనిపోయి ఉంటుందని భావిస్తున్నారంట అధికారులు.

అయితే ఈ విషయంలో పూర్తి వివరాల కోసం మరింత లోతుగా పరిశీలిస్తున్నారని తెలుస్తుంది. మరోపక్క ఈ రైతుపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు అనేది ఆసక్తికరంగా మారగా రైతు రివెంజ్ స్టోరీ మాత్రం వైరల్ అవుతోంది.

# పవన్ కామెంట్స్ పై పెద్దిరెడ్డి ఫైర్



జనసేన అధినేత పవన్ కల్యాణ్ తాజాగా వారాహి యాత్రలో దాడులపై చేసిన కామెంట్స్‌పై పెద్దిరెడ్డి ఫైర్ అయ్యారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పవన్ పై పరువునష్టం దావా వేయనున్నట్లు పెద్దిరెడ్డి హెచ్చరించారు. ఇదే సమయంలో విచారణకు ఆదేశించారు. కేంద్ర నిఘా వర్గాలు అంటూ కబుర్లు చెప్పడం ఫ్యాషన్ అయిపోయిందని ఫైరయ్యారు.

వారాహి తొలివిడత యాత్రలో భాగంగా ప్రభుత్వం భారీ స్కెచ్ వేసిందని, ఇందులో భాగంగా కోనసీమ జిల్లాల్లో 50 మందిని చంపాలని కుట్ర చేశారని, దీనికోసం రెండు వేల మంది రౌడీలను రాయలసీమ నుంచి దింపారని పవన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫైరయ్యారు. మొన్న వాలంటీర్లపై అవాకులూ చవాకులూ పేలి, ఇప్పుడు హత్యలు అంటూ కబుర్లు చెబుతున్నారన్ని అన్నారు.

దీంతో ఈ విషయాన్ని అంత సులువుగా వదిలేది లేదన్నట్లుగా స్పందించిన మంత్రి ఈ అంశంపై పోలీసులు విచారణ కోరుతున్నామని తెలిపారు. ఇదే సమయంలో పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. మాటమాటకీ ప్రభుత్వంపైనా, ప్రభుత్వ వ్యవస్థలపైనా బురదజల్లడానికి కేంద్ర నిఘా వర్గాలను సాకుగా పెట్టుకుంటారని, ఇదొక అలవాటుగా మారిందని పెద్దిరెడ్డి మండిపడ్డారు.

ఆ సంగతి అలా ఉంటే ఇదే సమయంలో చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ నేతలు చేపట్టిన బంద్ పై కూడా పెద్దిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా చంద్రబాబు అరెస్టుపై ప్రజల్లో ఎలాంటి నిరసన రాలేదని అన్నారు. టీడీపీ బంద్ ను ప్రజలు ఏమాత్రం పట్టించుకోలేదని చెప్పారు.

ఇదే సమయంలో చంద్రబాబు అరెస్టుకు మద్దతుగా రాష్ట్రం మొత్తం షాపులు మూయిస్తామని చెప్పిన టీడీపీ నేతలు, చంద్రబాబు సొంత సంస్థ హెరిటేజ్ ను కూడా మూయలేదని ఎద్దేవా చేశారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసు కేవలం ఆరంభం మాత్రమేనని చెప్పిన పెద్దిరెడ్డి రామ చంద్రా రెడ్డి చంద్రబాబుపై ఇంకా చాలా కేసులు ఉన్నాయని, పక్కా ఆధారాలతో సీఐడీ దర్యాప్తు చేస్తోందని స్పష్టం చేశారు.

# 12వ వార్డు పార్టీ నాయకుల ఆత్మీయ సమావేశం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** విశాఖ లాసన్స్‌బే కాలనీ క్యాంపు కార్యాలయంలో 12వ వార్డు వైసిపి పార్టీ నాయకులు ముఖ్య నాయకులతో 12వ వార్డ్ వైసీపీ కార్పొరేటర్ అక్కరమాని రోహిణి అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సమావేశంలో మంగళవారం ముఖ్య అతిథిగా ఎం పి, తూర్పు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ పాల్గొని అనంతరం మాట్లాడారు. రానున్న ఎన్నికలలో తూర్పు నియోజకవర్గం ఎంఎల్ఏ స్థానాన్ని అత్యధికంగా మెజార్టీతో గెలిచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని పేర్కొన్నారు. ఏపీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా ప్రతి కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని వెల్లడించారు.

ఇప్పటికే 12వ వార్డులో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు కార్పొరేటర్ ఆధ్వర్యంలో జరిగాయని గుర్తు చేశారు. కార్యక్రమములో ఏపిఐఐసి డైరెక్టర్ మొల్లి అప్పారావు, వార్డు సీనియర్ నాయకులు, వార్డు యూత్ సభ్యులు, పార్టీ శ్రేణులు మహిళలు పాల్గొన్నారు.

## అధికార పార్టీ అక్రమ అరెస్టులకు న్యాయం కోసం
# ప్రజల్లోకి నారా బ్రాహ్మణి, నారా భువనేశ్వరి?



**అమరావతి, (విశాఖ సమాచారమ్):** ఏపీ రాజకీయాలు శరవేగంగా మారిపోతున్నాయి. ఇప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఈ తరుణంలోనే చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, కోడలు నారా బ్రాహ్మణి ప్రజల్లోకి వెళ్లే అవకాశాలున్నాయని తెలుగుదేశం పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రాష్ట్రం కోసం, ప్రజల కోసం కష్టపడుతున్న చంద్రబాబు, లోకేష్ పై ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని, వారిని తప్పుడు కేసులో ఇరికించి వేధిస్తోందని, గడిచిన 24 గంటలుగా ఏం జరుగుతుందో మీరు చూస్తున్నారని న్యాయం మీరే చెప్పాలని ప్రజల వద్దకు వెళుతున్నట్లు తెలుస్తోంది.

వీరిద్దరూ ప్రజల్లోకి వెళ్లే అంశంపై ఇప్పటికే పార్టీలో ఓ కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైనట్లు సమాచారం. చంద్రబాబు అరెస్ట్ గురించి మాట్లాడే సమయంలో సీఐడీ చీఫ్ సంజయ్ నారా లోకేష్‌ను కూడా అరెస్ట్ చేసే అవకాశమున్నట్లు పరోక్షంగా చెప్పారు.

ప్రతిపక్ష నేతలను ఎన్నికల సంవత్సరంలో అరెస్ట్ చేయడం సాధారణంగా జరగవు. వారిపై ప్రజల్లో సానుభూతి వ్యక్తమైతే తమకు నష్టం చేస్తుందని అధికార పార్టీ ఆలోచిస్తుంది.

రాజకీయాల్లో సానుభూతిని మించిన అస్త్రం ఏదీ ఉండదు. వైఎస్ మరణించిన తర్వాత ప్రజల్లో సానుభూతి అనంతపురం నుంచి ఆదిలాబాద్ వరకు వెల్లువలా వచ్చింది. అదే తరహాలో ప్రస్తుతం సానుభూతిని ఉపయోగించుకోవాలని తెలుగుదేశం పార్టీ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

గతంలో టీడీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత లేకపోయినప్పటికీ జగన్ ఒక్క ఛాన్స్ అని అడగడంతో ప్రజలు ఇచ్చారని, అదే ప్రభుత్వంపై వ్యతిరేకత ఉండటంతో పాటు ప్రతిపక్ష నేతలను అరెస్ట్ చేసి వేధిస్తున్నారంటూ వారి కుటుంబ సభ్యులు రోడ్డెక్కితే సానుభూతి వెల్లువలా వస్తుందంటున్నారు. టిడిపికి చెందిన సీనియర్ నాయకులు.

# కలవరపెడుతున్న నిపా వైరస్.. కేరళలో ఇద్దరు మృతి




దేశంలో మరోసారి నిపా వైరస్ ఆందోళన కలిగిస్తోంది. తాజాగా కేరళలోని నిపా వైరస్ సోకి ఇద్దరు మృతి చెందడం కలకలం రేపుతోంది. దీంతో కరళలోని వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. వైరస్ వల్ల ప్రాణాలు కోల్పోయిన కుటంబ సభ్యులను వైద్యులు ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లోకి చేర్చారు. వివరాల్లోకి వెళ్తే గతంలో అందరిని వణికించిన నిపా వైరస్ మళ్లీ కేరళలో ప్రబలుతుతోంది. నిపా వైరస్ సోకడం వల్ల ఇన్ఫెక్షన్ రావడంతో కోజికోడ్ జిల్లాలోని ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ అధికారులు తెలిపారు. కేరళ ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ఉన్నతస్థాయి అధికారుల సమావేశం నిర్వహించి ప్రస్తుతం ఉన్న పరిస్థితిపై సమీక్ష చేశారు. ఒక ప్రైవేటు ఆసుపత్రిలోని నిపా వైరస్ వల్ల ఇద్దరు మృతి చెందినట్లు తెలిపారు. గతంలో 2021లో కూడా కోజికోడ్ జిల్లాలోనే నిపా వైరస్ వల్ల పలువురు మృతి చెందారు.

ఈ నిపా వైరల్ అనేది భారత్‌లో 2001లో మొదటిసారిగా బెంగాల్‌లోని సిలిగురి అనే ప్రాంతంలో బయట పడింది. ఆ తర్వాత మళ్లీ 2007వ సంవత్సరంలో కేరళలో కనిపించింది. వాస్తవానికి ఈ నిపా వైరస్ ముందుగా మెదడుకు ఇన్ఫెక్షన్‌ను కలిగిస్తుంది, ఆ తర్వాత మెదడువాపునకు కారణమవుతుంది. అందుకోసమే దీన్ని ఒకరకం మెదడువాపుగా కూడా భావించారు. ఒక్కసారి ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశించాక సగటున తొమ్మిది రోజుల్లో నిర్దిష్టంగా చెప్పాలంటే 5 నుంచి 14 రోజుల్లో లక్షణాలు కనిపిస్తున్నాయి. ఆ తర్వాత మెదడువాపు కారణంగా తలనొప్పి వస్తుంది. దీంతో తీవ్రమైన తలనొప్పి వల్ల కొంత మందిలో 24 గంటల నుంచి 48 గంటల్లో కోమాలోకి దారి తీయవచ్చు. అయితే ఈ వైరస్ సోకిన వారిలో జ్వరం, ఒళ్లు నొప్పులు, వికారం, వాంతులు కనిపించవచ్చు. అలాగే శరీరంలో దీర్ఘకాలికంగా వైరస్ ఉంటే మూర్ఛ, ప్రవర్తనలో మార్పులు కూడా కనిపిస్తాయి.

మెడ బిగుసుపోవడం, వెలుగును చూడలేకపోవడం వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. అలాగే కొందరిలో అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్‌లో ఊపిరి కూడా అందకపోవచ్చు. మరో విషయం ఏంటంటే గుండె కండరానికి ఇన్‌ఫ్లమేషన్‌కు దారి తీసే అవకాశం ఉంటుంది. మరోవిషయం ఏంటంటే అరుదుగా కొంతమందిలో లక్షణాలేవీ కనిపించకుండానే అకస్మాత్తుగా మరణం కూడా వచ్చే అవకాశం ఉంటుంది. అయితే ఇది చాలా అరుదు. నిపా వైరస్‌ను సంక్షిప్తంగా ఎన్‌ఐవీ అని అంటారు. ఇది మలేషియాలోని కాంపంగ్ షుంగై నిపా అనే ప్రాంతంలో 1998లో వ్యాపించడంతో ఈ వైరస్‌కు ఆ ప్రదేశం పేరు పెట్టారు. ఆ తర్వాత ఈ వైరస్ బంగ్లాదేశ్, భారత్‌లో వెలుగు చూసింది. అయితే ఈ నిపా వైరస్ అనేది ఫ్రూట్ బ్యాట్ అనే రకానికి చెందిన గబ్బిలాల నుంచి, పందుల నుంచి, అలాగే ఇన్ఫెక్షన్ సోకిన వ్యక్తుల నుంచి ఇతరులకు వ్యాపిస్తుంది.

# కస్తూర్బా పాఠశాలలో ఫుడ్ పాయిజన్: మంత్రి సీరియస్

**నిజామాబాద్:** ఫుడ్ పాయిజన్ కారణంగా కస్తూర్బా పాఠశాలలో దాదాపు 90 మంది విద్యార్థినులు అస్వస్థతకు లోనయ్యారు. తీవ్రమైన కడుపునొప్పితో పాటుగా వాంతులు చేసుకున్నారు. దీంతో, వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సీరియస్ అయ్యా రు.

వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా భీంగల్‌లోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం రాత్రి భోజనం చేసిన తర్వాత ఫుడ్ పాయిజన్‌తో 90 విద్యార్థినులకు కడుపు నొప్పితో పాటు వాంతులు అయ్యాయి.

దీంతో సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ ప్రత్యేకాధికారి శోభ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం అస్వస్థతకు గురైన విద్యార్థులందర్నీ నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

ఈ ఘటన సమాచారం తెలిసిన వెంటనే మంత్రి వేముల ప్రశాంత్ సీరియస్ అయ్యారు. దీనికి కారణమైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంత్‌కు ఆదేశాలు జారీ చేశారు.

తక్షణమే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని మంత్రి వేముల కలెక్టర్‌ను ఆదేశించారు.



# ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఉండాలి

## 20 నుండి 24 వరకు సచివాలయాలలో ఆధార్ క్యాంపులు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పుట్టిన బిడ్డ నుండి వృద్ధుల వరకు అందరూ ఆధార్ కార్డు కలిగి ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన జిల్లాస్థాయి ఆధార్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆధార్ వలన కలిగే లాభాలను గూర్చి అందరికీ అవగాహన కలిగించాలన్నారు. ఆధార్ దుర్వినియోగం జరుగుతున్న ట్లు, అమాయక ప్రజల బయోమెట్రిక్ సంగ్రహించి ఆర్థిక నేరాలు జరుగుతు న్నట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ తెలియజేశారు. ఈ విషయమై బ్యాంకు, పోలీసు, ఆధార్ అధికారులు కలిసి జాయింట్ ఆపరేషన్ నిర్వహించాలని ఆదేశించారు. ఆధార్ రీజనల్ మేనేజర్ షేక్ జావీద్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. 2015 సం.కి ముందు ఆధార్ కార్డు తీసుకున్న వారు అప్ టు డేట్ చేసుకోవాలన్నారు.

వారి గుర్తింపు కార్డు, చిరునామా ఇతర వివరాలకు సంబంధించిన పత్రాలతో రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు ఆసుపత్రిలోనే ఆధార్ కార్డు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో డిఎస్ డబ్ల్యుఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి, అనకాపల్లి డిఎల్‌డివో ఉదయశ్రీ, డీఈవో వెంకట లక్ష్మమ్మ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పిడి అనంతలక్ష్మి, జిల్లా పోస్టల్ అధికారి ఎస్ కే పండా, పోలీసు, ఆరోగ్య శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తగరంపూడి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన రత్నాకర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** మండలంలోని తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి వైసీపీ పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ మంగళవారం సందర్శించారు. ఆసుపత్రిలో గల సమస్యలను అక్కడి వైద్యురాలు డాక్టర్ రమాదేవి అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ ఇద్దరు డ్యూటీ డాక్టర్ల కొరత ఉందని అక్కడి వైద్యులు చెప్పారు. రోగులకు అందించే సేవలు, మందుల పంపిణీ సక్రమంగా జరుగుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రత్నాకర్ తెలియజేశారు.ఈ కార్య క్రమంలో పాల్గొన్న బొడ్డపాటి చిన్న రాజారావు, నందవరపు కుమార్, నందవరపు శంకర్రావు, నందవరపు బుజ్జి, యన్నం శెట్టి శ్రీను, ఎర్ర బుజ్జి, ఎర్ర వరహాలు, పట్టా వాసు, వేపాడ బాబురావు, ఎర్ర గణేష్, నంబారు రమణ, బీసీ సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర వ్యవస్థాపకులు మొల్లి రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

## నీతి అయోగ్ సీఈఓకు ఘన స్వాగతం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** నీతి అయోగ్ సీఈఓ బివిఆర్ సుబ్రమణ్యం విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా విశాఖ విమానాశ్రయంలో జివిఎంసి కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

## రాజాం, బొబ్బిలిలో జగనన్నకు చెబుదాం వాయిదా

**విజయనగరం:** ఈ నెల 13 న రాజాం, 15 న బొబ్బిలి నియోజకవర్గ కేంద్రాల్లో జరగాల్సిన జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు వాయిదా పడ్డాయి. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి జిల్లా పర్యటన కారణంగా ఈ రెండు కార్యక్రమాలను వాయిదా వేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్డి అనిత తెలిపారు. మళ్ళీ ఎప్పుడు నిర్వహించేదీ తరువాత తెలియజేస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

**విజయనగరం:** ఓటర్ల జాబితా రూపకల్పన, సవరణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఏఈఆర్వోలు స్వయంగా వెళ్లి పరిశీలించాలని, అక్కడ పరిస్థితిని, సమస్యలను వివరిస్తూ నివేదిక సమర్పించాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లకుండా తప్పుడు నివేదికలు ఇచ్చినట్లయితే ఏఈఆర్వోలపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ ఘాటుగా స్పందించారు. ఓటర్ల జాబితా ప్రక్రియలో ప్రతి అంశమూ చాలా ముఖ్యమని ఎక్కడా చిన్న తప్పు కూడా దొర్లడానికి వీలు లేదని పేర్కొన్నారు. ఒకటికి రెండు సార్లు పరిశీలించి నివేదికలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, ఇతర అంశాలపై పలు మార్గ నిర్దేశకాలు జారీ చేశారు. ఆయా జిల్లాల్లోని ఓటర్ల జాబితా తాజా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి. ఎస్, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, ప్రత్యేక ఉప కలెక్టర్లు,



ఆర్డీవోలు, ఎలక్షన్ సెల్ అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వీసీ అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి జిల్లా అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను పాటిస్తూ ఓటర్ల జాబితాను రూపొందించాలని, తప్పులు దొర్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఒకే ఇంటి చిరునామాతో పలు ఓట్లు నమోదు అయిన విషయంలో త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన అంశాలకు సంబంధిత ఓటర్ల నుంచి ఫారాలు తీసుకోవాలని పెండింగ్ నివేదికలను నిర్ణీత కాలంలోగా పూర్తి చేయాలని చెప్పారు. అలాగే రాజకీయ పార్టీల నుంచి వచ్చిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి సరైన పరిష్కారాలు చూపాలని ఆదేశించారు. ఎన్నికలు, ఓటర్ల జాబితా ప్రక్రియకు సంబంధించి విధుల్లో ఎవరు అలసత్వం ప్రదర్శించినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఎవరి పరిధిలో వారు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఫారం -6, 7, 8కి సంబంధించిన అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లేకుండా చూసుకోవాలని చెప్పారు. ఏఈఆర్వోలు అందరూ తప్పకుండా స్వయంగా వెళ్లి పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, అక్కడున్న తాజా పరిస్థితిని వివరిస్తూ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

వీసీలో భాగంగా జిల్లాలో చేపట్టిన చర్యల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల కమిషన్ కు జిల్లా కలెక్టర్ వివరించారు. ఓటర్ల జాబితా వివరాలను వెల్లడించారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో ఎస్.డి. అనిత, ప్రత్యేక ఉప కలెక్టర్లు దొర, వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు సూర్యకళ, అప్పారావు, విజయనగరం తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఐదు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్వాడీ కార్యకర్తలు, 13 ఆయా పోస్టులకు మంగళవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. నర్సీపట్నం ఐసిడిఎస్ పరిధిలో ఒక హెల్పర్ పోస్టు, గొలుగొండ ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్వాడి కార్యకర్తలు, ఐదు ఆయా పోస్టులకు, నక్కపల్లి ప్రాజెక్ట్ పరిధిలో మూడు ఆయా పోస్టులకు, వి.మాడుగుల ప్రాజెక్ట్ పరిధిలో రెండు ఆయా పోస్టులకు, రావికమతం ప్రాజెక్టు పరిధిలో రెండు ఆయా పోస్టులకు, మొత్తం 15 పోస్టులకు 44 మంది మహిళలు దరఖాస్తులు చేశారు. వీరిని రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్లతో కూడిన కమిటీ వీరిని ఇంటర్వ్యూ నిర్వహించారు.

## ఘనంగా చింతకాయల వరహాలదొర 50వ వర్ధంతి



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):** మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్నపాత్రుడు తండ్రి అయిన కీర్తిశేషులు చింతకాయల వరహాలదొర 50వ వర్ధంతి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ మేరకు నర్సీపట్నంలోని అయ్యన్నపాత్రుడు పొలాల వద్ద ఏర్పాటు చేసిన చింతకాయల వరహాలదొర విగ్రహానికి అయ్యన్న కుటుంబ సభ్యులు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో అయ్యన్న సతీమణి చింతకాయల పద్మావతి, తనయుడు రాజేష్, కుటుంబ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## క్వాలిఫై అయిన ఎస్ఐలకు వంద మీటర్ల రన్, లాంగ్ జంప్ పరీక్షలు





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎస్.ఎల్.పి.ఆర్.బి ఆధ్వర్యంలో నిర్వహించు స్టైపెండరీ క్యాడెట్ ట్రైనీ ఎస్ఐ, ఆర్ఎస్ఐల పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా, విశాఖపట్నం రేంజ్ కు సంబంధించి ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన వారు, 800 మంది అభ్యర్ధులకు దేహదారుఢ్య (ఫిజికల్ మెజర్మెంట్ అండ్ ఫిజికల్ ఎఫిషియన్సీ) పరీక్షలను కైలాసగిరి ఆర్మ్డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ వారి పర్యవేక్షణలో పరీక్షలు జరిగాయి. సోమవారం మొత్తం 800 మంది అభ్యర్థులకు గాను, మొత్తం 654 మంది హాజరయ్యారు.

దేహదారుఢ్య పరీక్షలకు హాజరవు అభ్యర్థులు తప్పనిసరిగా పుట్టిన తేదీకి సంబంధించిన, కనీస విద్యార్హతకు సంబంధించిన, కుల ధ్రువీకరణకు సంబంధించిన, ఓబీసీ నాన్ క్రిమిలేయర్ అయితే రిక్రూట్మెంట్ నోటిఫికేషన్ తర్వాత తీసుకున్న నాన్ క్రిమిలేయర్, అబారిజన్ ఎస్టి అయితే వాటికి సంబంధించిన అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, అటెస్టేడ్ జిరాక్స్ కాపీలు తప్పనిసరిగా తీసుకురావాలి. అభ్యర్థులకు మొదటగా ఒరిజినల్ సర్టిఫికెట్స్ పరిశీలన, బయోమెట్రిక్ పరిశీలన అనంతరం ఎత్తు, బరువుకు సంబంధించిన ఫిజికల్ మెజర్మెంట్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. వాటిలో క్వాలిఫై అయిన అభ్యర్థులకు 1600 మీటర్స్ రన్, తదనంతరం 1600 మీటర్స్ రన్‌లో క్వాలిఫై అయిన అభ్యర్థులకు 100 మీటర్స్‌రన్ మరియు లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మరియు నోడల్ ఆఫీసర్ దిలీప్ కిరణ్, ఏ.ఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఇతర అధికారులు మరియు మినిస్ట్రీయల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గడపగడపకు... కార్యక్రమం పై ప్రజల నుండి విశేష స్పందన



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** గడపగడపకు మన ప్రభుత్వము కార్యక్రమంలో భాగంగా విశాఖ ఉత్తర నియోజకవర్గం 49వార్డు మురళినగర్-3 సచివాలయం 1086279 మురళినగర్ సెక్టార్ 3,4,8 ప్రాంతంలో విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్ క్యాప్ చైర్మన్ కె.కె రాజు 49వార్డు కార్పొరేట్ర్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్ రావుతో కలిసి పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్ళి ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ ఫలాలను వివరిస్తూ - ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పర్యటించారు.

ఈ సందర్భంగా కె.కె రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వర్యులు వై.యస్ జగన్మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని నాడు ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకునేందుకు చేపట్టిన పాదయాత్రలో ప్రజల ఆర్థిక ఇబ్బందులను నేరుగా తీసుకున్నారని దానికి అనుగుణంగా నేడు విద్య, వైద్యం, ఉపాధి ప్రతి పేదవాడికి అందేవిధంగా పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు.

రానున్న రోజుల్లో మరలా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.యస్ జగన్మోహన్ రెడ్డి కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రొంగాలి జగన్నాథం, యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, jcs మండల ఇంచార్జ్ నీలిరవి, అమర్ రెడ్డి, డైరెక్టర్ యన్.రవి కుమార్, 49 వార్డు నాయకులు డిల్లీ రావు, ఎస్ చంద్రశేఖర్, ఆదిరెడ్డి శ్రీను, శకుంతల, సరస్వతి మంగ, ప్రశాంతి, ఎస్ శ్రీను, మున్న, శివరాంప్రసాద్, శంకర్, రమేష్, చైతన్య, సీనియర్ నాయకులు షేక్‌బాబ్జి కె.చిన్నా, గాలి ప్రసాద్, జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, వాలంటరీ సిబ్బంది RPలు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ నూకాంబిక అమ్మవారికి సేవలు అందిస్తున్న కమిటీలతో సమావేశమైన చైర్మన్ మురళీకృష్ణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** నూకాంబిక దేవస్థానంలో చాలా ఏళ్లగా అమ్మవారికి సేవలు అందిస్తున్న శ్రీ నూకాంబిక మాలాధారణ కమిటీ, అదిబాబు అమావాస్య యూత్, శ్రీ నూకాంబిక భజనమండలి సభ్యులతో ధర్మకర్తల మండలి అమ్మవారి ప్రాంగణంలో సోమవారం రాత్రి సమావేశం నిర్వహించింది. దేవస్థానం చైర్మన్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ కొత్త అమావాస్య, నెలపండగ, దసరా మహోత్సవాలు, నిత్యాన్నదానం వంటి కార్యక్రమాలు దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహింపబడుతున్నాయని, భక్తులు కూడా అమ్మవారి పండగలు, గంపజాతరాలు ఘనంగా జరుపుకుంటారని, వీటితో పాటు జాతరకి 45 రోజులు ముందు మాలాధారణ భక్తులు దీక్షలు చేసి భారీ అంబలం పూజ, సుమారు పదివేలమందికి అన్నప్రసాదం ఏర్పాటు చేయడంతో పాటు ప్రతి సంవత్సరం సుమారు 10 లక్షల రూపాయిలు వెచ్చించి పురవీధులు గుండా భారీ ఊరేగింపు నిర్వహించడం అనేది చాలా గొప్ప విషయం అని అన్నారు. అదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ప్రతీ అమావాస్య రోజున లక్ష రూపాయలు ఖర్చుతో అమావాస్య పూజలు చేయడంతో పాటు సుమారు వెయ్యిమందికి అన్నప్రసాదం ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయం అని కొనియాడారు. అమ్మవారి మూల విరాట్ వున్న దేవాలయం పునర్ నిర్మాణంలో ఉండటం మూలంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాలాలయంలో భజనలు నిరాటంకంగా కొనసాగించాలని భజనమండలి వారిని కోరారు. ఈ కార్యక్రమంలో సేవా కార్యక్రమాలలో నిర్వాహకులు పొలిమేర శ్రీను, కాంద్రేగుల సోమేశ్, పొలమరశెట్టి కుమార్, షణ్ముఖ స్వీట్స్ భాను తదితరులు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు పీలా లక్ష్మి శ్రీనివాస్, బుద్ధ నర్సింగరాజు, కొండూరి రవీంద్ర నాథ్, మల్లవరపు ఈశ్వర్రావు, వై. వాసు పంతులు, సేవకులు డి. జ్ఞానదీప్ పాల్గొన్నారు.

## కార్టూన్స్‌కు అలవాటు పడిన బాలుడు అనుమాస్పద మృతి

### సరదాగా ఆడుతూ ప్రాణాలు పోగొట్టుకున్న చిన్నారి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** స్కూల్ నుంచి వచ్చాక స్కూల్ బ్యాగ్ ఇంట్లో పెట్టి ఓ చున్ని తీసుకొని వరండాలో ఆడుకుంటున్నాడు. తల్లి లోపల గదిలో టీవీ చూస్తూ ఉంది. తండ్రి శ్రీనివాసరావు ఇంట్లో లేడు. అటుగా వెళుతున్న ఓ మహిళ పెద్ద కేకలు వేసింది. దీంతో లోపల నుంచి వచ్చిన తల్లి శ్రీలక్ష్మి మెట్ల పక్కన చున్నీకి వేలాడుతున్న కొడుకుని చూసి గుండె పట్టుకుంది. కత్తిపీటతో చీరను కట్ చేసి బాలుడిని కిందకు దించింది.

కార్టూన్లు చూడడమంటే ఆ బాలుడికి సరదా. ఎప్పుడు టీవీ ఆన్ చేసినా కార్టూన్ ఛానల్‌కు అతుక్కుపోయేవాడు. సెల్ ఫోన్ ఇచ్చినా అందులోను కార్టూన్లే చూసేవాడు. ఆయా కార్టూన్లలో ఉన్నట్టు ప్రవర్తిస్తూ ఆడుకునేవాడు. గతంలోనూ ఓసారి మంచానికి తాడు వేసుకొని బిగించుకోవాలని చూశాడు. అంతేకాదు చనిపోయే ఆట ఆడుకుంటానంటూ తల్లితో కూడా చెప్పి అన్నంత పనీ చేది ఆ కుటుంబంలో విషాదం మిగిల్చాడు.

## రావికమతం మండల స్థాయి "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం వాయిదా

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** (సెప్టెంబర్ 13 వ తేదీన) రావికమతంలో జరుగనున్న మండల స్థాయి "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం వాయిదా పడిందని జిల్లా రెవెన్యూ అధికారి బి .దయానిధి తెలియజేశారు. రేపు "జగనన్న ఆరోగ్య సురక్ష" కార్యక్రమం పై ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ఉన్నందున, రావికమతం మండల స్థాయి "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం వాయిదా పడిందని, ఈ నెల 20వ తేదీ బుధవారం రావికమతంలో "జగనన్నకు చెబుదాం" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి బి .దయానిధి ఒక ప్రకటనలో తెలియజేశారు.

# డయల్ యువర్ కలెక్టర్‌కు 19 కాల్స్

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ప్రజల సమస్యల్ని నేరుగా తెలుసుకునేందుకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని ప్రతి మంగళవారం నిర్వహిస్తున్నమని జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అన్నారు. మంగళవారం కాకినాడ జిల్లా కలెక్టరు డా. కృతికాశుక్లా ఉదయం 10:30 గంటల నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాల్లో వివిధ ప్రాంతాల నుంచి 19 మంది సంక్షేమ పథకాల లబ్ధి, విద్య, ఉపాధి, భూ సర్వే, భూ సమస్యలు వంటి సమస్యలపై టోల్ ఫ్రీ నెంబర్ 18004253077కు ఫోన్ చేసి జిల్లా కలెక్టరుకు నేరుగా తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా మాట్లాడుతూ డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో ఫోను ద్వారా తెలియజేసిన సమస్యలను గడువులోగా పరిష్కరించాలన్నారు.

ఫోన్ ద్వారా తెలియజేసిన 19 మంది వ్యక్తుల సమస్యలను పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు పంపించడం జరిగిందన్నారు. ఈ సమస్యలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టరు కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, వివిధ సెక్షన్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వర శతక పుస్తకావిష్కరణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లికి చెందిన ప్రముఖ కవి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు శిష్టా తమ్మిరాజు విరచిత 'దాస తమ్మిరాజు దండ మిదియె' అను వేంకటేశ్వర స్వామివారి శతక కావ్యము అమెరికా ఫ్లోరిడా రాజధాని తలహాస్సీ నగరంలో అంగరంగ వైభవంగా జరిగింది. సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ కవి, సంగీత దర్శకులు శ్రీనివాస భరద్వాజ కిశోర్ చేతుల మీదుగా ఈ పుస్తక ఆవిష్కరణ జరిగింది. శతక కర్త అద్భుతమైన భక్తి భావంతో చక్కని పద్యాలు రచించడమేశకాకుండా ఈ నగరం నూతనంగా నిర్మింపబడిన వేంకటేశ్వరస్వామి వారికి అంకిత మివ్వడం ఇక్కడ ఉన్న తెలుగు వారంతా ఎంతో ఆనందిస్తున్నారని సభాధ్యక్షులు కిశోర్ తమ ప్రసంగంలో ప్రశంసించారు. ప్రముఖ గాయని నోరి రాధిక తన చక్కనిగానంతో పద్యాలు వీనుల విందుగా ఆలపించగా ప్రముఖ పండితురాలు డా. సుమన గారు ఆపద్యాలను కమీక్ష చేస్తూ పద్యాలు సరళంగా సుభోదకంగా ఉన్నాయని ప్రశంసించారు. పద్యకవి జానపతి రవిగారు మొత్తం కావ్య సమీక్ష చేస్తూ ఇది ప్రతీ వారింట ఉంచదగిన భక్తి కావ్యమని అరిషడ్వార్గాల జయించే శక్తి మానవులకు ప్రసాదించమని శ్రీవారి సేవలు మొదలైన విశేషాలను బహు చక్కగా రచించారని శ్లాఘించారు. తలహసీ ఇండియన్ అసోసియేషన్ అధ్యక్షులు దస్తగిరి మాట్లాడుతూ వీరి కుమారుడు అరుణ్ కోడలు పావని జన్మ ధన్యమయిందని పిల్లలు తలిదండ్రుల ను ఎలా గౌరవించాలో ఈ సభద్వారా మాకందరికీ స్ఫూర్తి నిచ్చారని వారికి అభినందనలు తెలిపారు. ప్రముఖ వేదపండితులు లెక్చరర్ గంగవరపు ఆంజనేయ శర్మ వేద పఠనంతో ఆశీర్వదించారు. పుస్తక రచయిత తమ్మిరాజు తమ స్పందనలో ఈ శతకం వ్రాయడంలో ఎంతో మంది తనకు సలహాలు సూచనల ద్వారా సహకరించారని వారికి కృతజ్ఞతలు తెలియ జేస్తూ ఆ శ్రీనివాసుని అనుగ్రహం ముఖ్య కారణమని తన భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. అంతేగాక టాలహాస్సీ తెలుగు సాహిత్యోత్సాహుల సమూహ సభ్యులు ఇంత ఆదరణతో అభిమానం చూపి ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిపినందుకూ ఇక్కడ వారంతా తెలుగు భాష పట్ల చూపుతున్న ఆదరణ అభిమానాలకీ కృతజ్ఞతలు తెలిపారు. తలహాస్సీ వేంకటేశ్వరదేవస్థాన పాలక వర్గ సభ్యులు పుచ్చా సుబ్రం వందన సమర్పణ చేస్తూ ఈ కార్యక్రమం ఇంత విజయవంతం అయినందుకు ఇందుకు తోడ్పాటు అందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేసారు.

# నా భూమి నా దేశంలో భాగంగా గ్రామాల్లో మట్టి సేకరణ



**యలమంచిలి, (విశాఖ సమాచారమ్):** భారత ప్రధాని నరేంద్ర మోడీ స్వతంత్ర అమృత్సవాల సమయంలో సంకల్పించిన నా భూమి నాదేశం, కార్యక్రమం దేశ వ్యాప్తంగా భారతదేశాన్ని కాపాడిన సమర సమరయోధుల స్ఫూర్తిని తెలియజేస్తూ ప్రతి మండలంలో గ్రామాల నుండి జన్మభూమి మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించడం, ఆ ప్రాంత పేర్లతో స్థూపాన్ని ఏర్పాటు చేయమని పిలుపు నివ్వగా మంగళవారం యలమంచిలి మండలంలో బిజెపి పార్టీ నాయకులంతా గ్రామాల్లో జన్మభూమి మట్టి సేకరణ కార్యక్రమాన్ని ఎర్రవరంలో ప్రారంభించా రు. ఈ కార్యక్రమంలో పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షులు రాజాన సత్యనారాయణ, మాజీ అధ్యక్షులు పిట్టా దాసు బాబు, బిజెపి సీనియర్ నాయకులు రామకృష్ణరాజు, కొల్లి సత్య నారాయణ, బోడపాటి వెంకటరమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# పొలాల అమావాస్య వ్రత కథ



అనగా అనగా ఒక ఊర్లో ఓ బ్రహ్మణమ్మ . ఆమెకు ప్రతి సంవత్సరం పిల్లలు పుడుతునారు -పోతున్నారు. పుట్టగానే పోతున్న సంతానానికి ధుఖించి ఆ బ్రహ్మణమ్మ ఊరి వెలుపల పోచక్క తల్లి చుట్టు ప్రతి ఏట పిల్లల్ని బొంద పెడుతున్నది. ఈ పొలలమావాస్యకు పుడుతున్నారు, మళ్లీ పొలలమావాస్యకి చనిపోతున్నారు. నోముకుందామని ఎవర్ని పేరంటం పిలిచినా రామంటున్నారు. ఈ విధంగా బాధపడుతున్న ఇల్లాలుకు మళ్లీ ఎప్పటివలె సంతానం మైనది, చనిపోయింది. ఆ పిల్లను తీసుకుని పోచమ్మ దగ్గర బొంద పెట్టేందుకు పోయింది. అప్పుడు పోచక్క తల్లి ఈ ఊర్లలో వాళంత నాకు మొక్కేందుకు వస్తారు. పాయసం, వడలు నైవేద్యం తెస్తారు. ఎడ్లకు రంగులు వేసి నెమలి పించం పెట్టి గాలి, ధూళి తగలకుండా ప్రదక్షణం చేయిస్తారు. పొలేర్ల కల్లు తెస్తారు. వాళ్ళ పెళ్ళాలు కడవలతో పానకం తెస్తారు. నువ్వెందుకు శవాలు నా చుట్టూ బొంద పెడుతున్నావని ప్రశ్నించింది. అమ్మా! పోచక్క తల్లి వేయి కళ్ళ తల్లివి నీకు తెలియనిది ఏముంది. నేను పూర్వ జన్మలో ఏ పాపం చేసానో నాకు పుట్టిన సంతానం ఎప్పటికప్పుడు మరణిస్తునారు అని బాధ పడింది. అప్పుడు పోచమ్మ తల్లి "బ్రహ్మణమ్మ పోయిన జన్మలో పొలలమావాస్య పేరంటాలు రాక ముందే పిల్లలు ఏడిస్తే ఎవరు చూడకుండా పాయసం, గారెలు పెట్టిందని , పులుసు తీపి సరిపోయిందో లేదో చవిచూసింది అని, మడి, తడి లేకుండా అన్ని అమాంగిలం చేసిందని అందుకే ఆమె పిల్లలు అలా పుట్టి పెరిగి చనిపోయినారని" చెప్పింది. హీరోయిన్స్ విషయంలో అల్లు అర్జున్ కాన్సన్ ట్రేషన్హీరోయిన్స్ విషయంలో అల్లు అర్జున్ కాన్సన్ ట్రేషన్ తన అపరాధాన్ని తెలుసుకున్న బ్రహ్మణమ్మ పోచక్క తల్లి కాళ్ళమీద పడి తనను క్షమించమని వేడుకున్నది. అమ్మలక్కలు కలియుగం పుట్టనున్నది, పెరగన్నునది కనుక ఈ వ్రత విధానం మాకు తెలుపమని వేడుకోగా పోచక్క ఇలా తెలిపింది. "శ్రావణమాసం చివర బాద్రపదమాసం తొలుత వచ్చే అమావస్యని పొలలమా వాస్య అంటారు.

గోడను ఆవు పేడ పాలతో అలికి, పసుపు కుంకుమతో పొలాలు రాసి, కంద మొక్కని అమ్మగా భావించి 9 వరుసల దారంతో పసుపు కొమ్ము కట్టి, ఆ తోరం పోచక్క తల్లికి కట్టి పూజ చేయాలి. 9 వరుసల తోరం పేరంటాలకి ఇచ్చి మనము కట్టించుకోవాలి. పిండి వంటలు నైవేద్యం చేసి అమ్మకి నివేదన చేయాలి. భోజనం అనంతరం తాంబూలం దక్షిణ శక్తి కొలది సమర్పించాలి. ఇలా చేస్తే పిల్లలు మృత్యువాత పడకుండా కలరా, మలేరియా , మశూచి మొదలైన వ్యాధులు రాకుండా పోచక్క తల్లి కాపాడుతుందని" చెప్పింది. ఈ విధంగా బ్రహ్మణమ్మ ఈ వ్రతంని చేసి తన చనిపోయిన సంతానాన్ని తిరిగిపొందింది.

# డైట్ లో ఉన్నత భారత అభియాన్ కార్యక్రమం ప్రారంభం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ఉన్నత భారత అభియాన్" ప్రోగ్రాం ను మంగళవారం ప్రారంభించారు . ఇందులో భాగం గా యు బి ఎ కో ఆర్డినేటర్ బీశెట్టి పావని కళాశాలను సందర్శించి కళాశాల దత్తత తీసుకొన్న అక్కిరెడ్డి పాలెం ,తలారివాని పాలెం ,బట్లపూడి , రేబాక ,శంకరం ఈ 5 గ్రామాలకు వెళ్లి అక్కడ ఉన్న ప్రతి ఇంటిని సందర్శించి వాళ్ళ సమస్యలను అడిగి తెలుసుకొన్నారు . అక్కడ గల రోడ్లు ,త్రాగునీరు ,కాలుష్య సమస్యలను ప్రజలు వివరించారు .అనంతరం సచివాలయాలు సందర్శించి అక్కడ ఉన్న జనాభా వాళ్ళ వివరము అనగా అక్షరాస్యత .నిరక్షరాస్యత ప్రతి ఇంట్లో పని చేసే వాళ్ళు వివరములు అడిగి తెలుసుకొన్నారు . ఈ యు బి ఎ కార్యక్రమము కేంద్ర ప్రభుత్వం ముఖ్యముగా అభివృద్ధి లేని గ్రామాలను గుర్తించి అక్కడ నివసిస్తున్న ప్రజలకు సాంకేతికంగా పరిజ్ఞానం పెంపొందించడము ముఖ్యలక్ష్యమని ,అలాగే తమ గ్రామాలలో చిన్న చిన్న సమస్యలకు కొంత నగదు రూపంలో చెల్లిస్తుందని చెప్పారు . ఈ కార్యకామమును కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభించారు . ఈ కార్యక్రమములో యెన్ ఎస్ ఎస్ విద్యార్థులు యెన్ ఎస్ ఎస్ ప్రోగ్రామర్ కో ఆర్డినేటర్ బి సుధీర్ కుమార్ , ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ .వైకుంఠరావు పాల్గొన్నారు.

# పట్టణ వాతావరణం పై యువత భాగస్వామ్యం కావాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** పట్టణ వాతావరణం పై యువతను భాగస్వాములుగా చేయాలని ఉద్దేశంతో జివిఎంసి కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ సూచనల మేరకు జివిఎంసి, ఎస్ ఆర్ యు, ఎన్ ఐ వి ఏ సంయుక్తంగా జివిఎంసి ప్రధాన కార్యాలయంలోనే సమావేశ మందిరంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా పట్టణ ప్రజలకు వాతావరణ పై అవగాహన, వాతావరణ ప్రభావాలను ముందే గుర్తించి ఆయా ప్రాంతాలను విపత్తుల నుండి సురక్షితంగా ఉంచడమే ఈ సమీక్ష ఉద్దేశం. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ అఫైర్స్ వారు విశాఖపట్నం కొచ్చి భువనేశ్వర్, సూరత్, పూణే మొదలైన నగరాలను ఎంపిక చేయడం జరిగింది. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రాథమిక దశ నుండే వాతావరణ ప్రభావం పై విద్యార్థులకు బోధించడం, సముద్ర తీర ప్రాంతంలోని మత్స్యకారులకు, నగర ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ సమావేశంలో ఆంధ్ర యూనివర్సిటీ అధ్యాపకులు, ఎన్జీవోస్, విశాఖపట్నం ఇండియన్ మెట్రాజికల్ డిపార్ట్మెంట్ ప్రతినిధులు, అధ్యాపకులు, స్టూడెంట్స్, సివిల్ డిఫెన్స్ ఆర్గనైజేషన్, పలువురు డాక్టర్లు ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని చర్చించారు.

# పట్టణ వాతావరణం పై యువత భాగస్వామ్యం కావాలి



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా పునః పరిశీలనను చేపట్టడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా అన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా మంగళవారం విజయవాడ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లడారు. ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ -2024 ప్రక్రియ, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, తొల గింపు అభ్యంతరాల పరిష్కారం, ఓటర్ల పునః పరిశీలన, పోలింగ్ కేంద్రాల మార్పు, ఎపిక్ కార్డుల జనరేషన్ తదితర అంశాల పై ఎన్నికల సీఈవో.. కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు కాకినాడ కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు డా. కృతికా శుక్లా.. అధికారులతో కలిసి హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలో జనవరి 6, 2022 తేదీ నుంచి ఆగస్టు 9, 2023వ తేదీ వరకు వచ్చిన మరణించిన, ఆచూకీ లభించని కేసులు అన్నిటిని పునః పరిశీలన చేపట్టినట్లు ఎన్నికల సీఈవోకి కలెక్టర్ వివరించారు. నిర్దేశిత గడువులోపు పునః పరిశీలన ప్రక్రియ నూరు శాతం పూర్తిచేయడం జరిగిందని, జిల్లాలో 1,634 పోలీస్ స్టేషన్లో పరిధిలో జరిగినటువంటి ఇంటింట సర్వే వివరాలు, ఫారం 6, ఫారం 7, ఫారం 8లకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అభ్యంతరాలను పరిష్కరించే నిమిత్తం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి వారం సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆమె వివరించారు.

అనంతరం జిల్లా కలెక్టరు డా. కృతికా శుక్లా.. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల ప్రత్యేక సంక్షేప సవరణ జాబితా- 2024 రూపకల్పనపై చేపట్టిన ఓటర్ల పునః పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం, నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. కొత్త ఓటు నమోదుకు జనవరి 1, 2024 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదుకు అర్హులని కలెక్టర్ వివరించారు. జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు అన్ని బూత్ స్థాయి ఏజెంట్స్ నియామకం పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు సమావేశంలో డీఆర్వో కె. శ్రీధర్ రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం, ఆర్.వెంకటేశ్వరరావు (వైసీపీ), సీహెచ్ రమేష్ బాబు (భాజపా), కె. కృష్ణమోహన(ఆమ్ ఆద్మీ పార్టీ) తదితరులు హాజరయ్యారు.

# రాష్ట్రపతి భవన్ నుండి సెప్టెంబర్ 13, 2023న ఆయుష్మాన్ భవ ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించనున్న గౌరవనీయులైన భారత రాష్ట్రపతి, ద్రౌపది ముర్ము

**న్యూఢిల్లీ, (పీఐబీ):** భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ యాక్సెసిబిలిటీ మరియు ఇన్క్లూసివిటీని పునర్నిర్వచిం చటానికి ఏర్పాటు చేస్తున్న ఒక ముఖ్యమైన కార్యక్రమంలో, గౌరవనీయ భారత రాష్ట్రపతి, ద్రౌపది ముర్ము, సెప్టెంబర్ 13, 2023న ముందు చూపుతో కూడిన 'ఆయుష్మాన్ భవ' ప్రచారాన్ని ప్రారంభిస్తారు. ఈ చారిత్రాత్మక ప్రయోగం రాష్ట్రపతి భవన్ నుండి వర్చువల్ ఈవెంట్ ద్వారా జరుగుతుంది. ఇది యూనివర్సల్ హెల్త్ కవరేజ్ సాధించడం మరియు అందరికీ ఆరోగ్య సంరక్షణను అందించడంలో గణనీయమైన పురోగతిని సూచిస్తుంది.

భారత ప్రభుత్వంలోని ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 'ఆయుష్మాన్ భవ' ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. దేశంలో ని ప్రతి గ్రామం మరియు పట్టణానికి చేరుకునేలా ఆరోగ్య సంరక్షణ సేవల సంతృప్త కవరేజీని అందించడానికి ఉద్దేశించిన సమగ్ర దేశవ్యాప్త ఆరోగ్య సంరక్షణ కార్యక్రమం ఇది. ఈ సంచలనాత్మక చొరవ ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం యొక్క విజయంపై ఆధారపడింది. అలాగే ఆరోగ్య సంరక్షణ సేవలలో ఒక నమూనా మార్పునుసైతం సూచిస్తుంది.

'సేవా పఖ్వాడా' పేరిట సెప్టెంబరు 17 నుండి అక్టోబర్ 2, 2023 వరకు జరిపే ప్రచార సమయంలో,మొత్తం దేశం మరియు మొత్తం-సమాజాన్ని ఏకతాటి పైకి తీసుకొచ్చి ముందుకెళ్లే విధానాన్ని కలిగి ఉంటుంది. ఇది ప్రభుత్వ రంగాలు, పౌర సమాజ సంస్థలు మరియు కమ్యూనిటీలను ఒక ఉమ్మడి మిషన్ కింద ఏకం చేస్తుంది. ఏ ఒక్కరికీ ఈ సేవల నుంచి మినహాయింపు లేకుండా ప్రతిఒక్కరూ ఇందులో భాగస్వామ్యం అయ్యేలా ఉంటుంది.

ఆయుష్మాన్ భవ ప్రచారం అనేది ఆరోగ్య శాఖ, ఇతర ప్రభుత్వ శాఖలు మరియు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని స్థానిక ఎన్నికైన సంస్థలతో సమన్వయంతో గ్రామ పంచాయితీలచే నిర్వహించబడుతున్న ఒక సహకార ప్రయత్నం. ప్రతి గ్రామం మరియు పట్టణానికి సమగ్ర ఆరోగ్య సంరక్షణను విస్తరించడం, భౌగోళిక అడ్డంకులను అధిగమించడం మరియు ఎవరూ వెనుకబడిపోకుండా చూసుకోవడం దీని ప్రధాన లక్ష్యం.

ఈ సినర్జిస్టిక్ విధానం దాని మూడు భాగాలైన ఆయుష్మాన్ - ఆప్కేద్వార్3.0, హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లలో (HWCలు) ఆయుష్మాన్ మేళాలు మరియు ప్రతి గ్రామం మరియు పంచాయతీలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు (CHCలు) మరియు ఆయుష్మాన్ సభల ద్వారా ఆరోగ్య సేవల కవరేజీని సంతృప్తపరచడం లక్ష్యంగా పెట్టుకుంది.

ఆయుష్మాన్ఆప్కేద్వార్3.0: PM-JAY పథకం కింద నమోదు చేసుకున్న మిగిలిన అర్హులైన లబ్ధిదారులకు ఆయు ష్మాన్ కార్డ్లను అందించడం ఈ చొరవ లక్ష్యం. ఎక్కువ మంది వ్యక్తులు అవసర మైన ఆరోగ్య సేవలను పొందేలా చూస్తారు.

హెచ్‌డబ్ల్యుసిలు మరియు సిహెచ్‌సి లలో ఆయుష్మాన్ మేళాలు: ఆయుష్మాన్ భారత్- హెచ్‌డబ్ల్యుసిలు మరియు సిహెచ్‌సిలలో ఈ మేళాలు ABHA IDలను (హెల్త్ IDలు) సృష్టించడానికి మరియు ఆయుష్మాన్భా రత్ కార్డ్ల జారీని సులభతరం చేస్తాయి. వారు ముందస్తు రోగ నిర్ధారణ, సమగ్ర ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ సేవలు, నిపుణులతో టెలికన్సల్టేషన్ మరియు తగిన సిఫార్సులను కూడా అందిస్తారు.

ఆయుష్మాన్ సభలు: ప్రతి గ్రామం మరియు పంచాయతీలో జరిగే ఈ సమావేశాలు ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేయడంలో, ABHA IDలను రూపొందించడంలో మరియు ముఖ్యమైన ఆరోగ్య పథకాలు మరియు అంటు వ్యాధులు, క్షయ మరియు సికెల్ కణ వ్యాధి వంటి వ్యాధుల పరిస్థితులపై అవగాహన పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

ఆయుష్మాన్ భవ ప్రచారం భారతదేశంలో సార్వత్రిక ఆరోగ్య కవరేజీని సాధించడానికి పునాది వేస్తూ, 'ఆరోగ్యకరమైన గ్రామాలు' మరియు 'ఆరోగ్యకరమైన గ్రామ పంచాయతీల'ని సృష్టించే దృష్టితో అనుసంధానిం చబడింది. ఆరోగ్య పథకాలను విజయ వంతంగా పూర్తి చేసిన పంచాయతీలు 'ఆయుష్మాన్ గ్రామ పంచాయతీ' లేదా 'ఆయుష్మాన్ అర్బన్ వార్డ్' అనే ప్రతిష్టాత్మక బిరుదును సంపాదిస్తాయి, ఇది సమానమైన ఆరోగ్య సంరక్షణ సదుపాయానికి వారి అంకితభావాన్ని సూచిస్తుంది.

ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్మాండవియా, డాక్టర్ భారతి ప్రవీణ్ పవార్, మరియు ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్, కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రులు, డాక్టర్ వీకే పాల్, సభ్యుడు (ఆరోగ్యం), నీతి ఆయోగ్, పలువురు పార్లమెంటు సభ్యులు మరియు ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నుండి సీనియర్ అధికారులు. గవర్నర్లు, ముఖ్యమంత్రులు, రాష్ట్ర మంత్రులు మరియు వివిధ రంగాలకు చెందిన వారి అధికారులు వాస్తవంగా అన్ని రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల నుండి పాల్గొనవలసిందిగా ఆహ్వానం పొందారు. జిల్లా హెడ్‌క్వార్టర్స్, బ్లాక్ హెడ్‌క్వార్టర్స్ మరియు వారి గ్రామాల్లోని హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ల నుండి పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు మరియు పాల్గొనేవారు సైతం హాజరవుతారు.

# సేవ చేయాలనే భావన అందరిలోనూ ఉండాలి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** సేవ చేయాలనే భావన ప్రతి ఒక్కరిలోనూ ఉండాలని భద్రకాళీ పీఠాధీశ్వరి సింధూ మాతాజీ అభిప్రాయ పడ్డారు. అలాంటి వారిని సమాజం కూడా గౌరవిస్తుందన్నారు. ఎంవీపీ కాలనీలో మంగళవారం ఆమె 'గమ్యం చారిటబుల్ ట్రస్టు'ను ప్రారంభించారు. అనంతరం ఆ ట్రస్టు ఫౌండర్ సత్యలక్ష్మితో కలసి ఆమె మాట్లాడారు. సత్య లక్ష్మి ఇప్పటికే ఎంతో మంది పేదలు, ఒంటరి మహిళలు, విద్యార్థులకు అండగా ఉన్నారని గుర్తు చేశారు. అనంతరం మాజీ ప్రొఫెసర్ దాసరి ప్రభాకర్, సామాజిక వేత్త గొంప కిషోర్ కుమార్, క్రికెట్ కోచ్ సీరపు చంద్రశేఖర్ రెడ్డి, ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి బలివాడ తదితరుల్ని మాతాజీ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గమ్యం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సత్యలక్ష్మి మాట్లాడుతూ ఆధ్యాత్మిక, కళారంగాల్లో విశిష్ట సేవలందించానని, సేవల్ని మరింతగా విస్తృతం చేసేందుకే ఈ ట్రస్టును ప్రారంభించామన్నారు. చేయి చేయి 'కలుపుదాం-చేయూతనిద్దాం' అనే నినాదంతో ట్రస్టు పనిచేస్తుందన్నారు. ఈ సంస్థ అన్ని స్వచ్ఛంద సంస్థల కంటే మకుటాయమానంగా నిలపగలననే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

జనసేన డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి రఘు మాట్లాడుతూ సామాజిక సేవా రంగంలో మహిళలు ముందుకు రావడం శుభ పరిణామం అన్నారు. గమ్యం చారిటబుల్ ట్రస్ట్ తన లక్ష్యాన్ని త్వరగా సాధించాలని కోరుకుంటున్నాని అన్నారు

కార్యక్రమంలో కుమార్, మోనా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సన్నీని సన్మానించిన సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** మోర్చ చిన్నమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరాశ్రయులకు సహాయ సహకారాలు అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్ మోర్చ సన్యాసి రావు (ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ పి.ఏ) ని ఇకపై అనేక సేవలు నిరుపేదలకు, నిరాశ్రయులకు అందించాలనే సదుద్దేశంతో ప్రశంస దీపిక కల్చరల్ & సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లివింగ్ స్టన్ (నరేంద్ర కుమార్) సారధ్యంలో జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ చేతుల మీదుగా శాలువాతో సన్మానించి మెమెంటో అందజేశారు.

ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే వాసుపల్లి దగ్గర పనిచేస్తూ తనకు కలిగిన దానిలో నిరుపేదలకు సహాయం చేస్తూ మంచి పేరు ప్రఖ్యాతలు తెచ్చుకోవాలని ఆశీర్వదించారు.

ఈ కార్యక్రమంలో జీవీఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ & మా అధ్యక్షులు దాడి సత్యనారాయణ, ట్రస్ట్ సభ్యులు లివింగ్ స్టన్ (నరేంద్ర కుమార్), ప్రకాష్, మా ఉపాధ్యక్షులు & సినీ ఫీల్డ్ రవితేజ, వైస్సార్సీపీ స్టేట్ యూత్ సెక్రటరీ మాదబత్తుల రమేష్, గోపాలకృష్ణ, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# డేవిస్ కప్: బోపన్న బుధవారం జట్టులోకి వస్తాడని భారత కెప్టెన్ రాజ్‌పాల్ తెలిపాడు



**లక్నో:** ఇటీవలే యుఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచిన టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న బుధవారం మొరాకోతో తలపడేందుకు సిద్ధమవుతున్న తరుణంలో భారత జట్టులో చేరనున్నాడని భారత డేవిస్ కప్ కెప్టెన్ రోహిత్ రాజ్‌పాల్ తెలిపాడు. శని మరియు ఆదివారాల్లో లక్నోలోని గోమతి నగర్‌లోని విజయాంత్ ఖండ్ మినీ స్టేడియంలో జరిగే వరల్డ్ గ్రూప్ II ప్లే-ఆఫ్స్ ఫిక్చర్ షెడ్యూల్‌లో ప్రస్తుతం డబుల్స్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో ఏడో ర్యాంక్‌లో ఉన్న 43 ఏళ్ల బోపన్న, గత వారం యూఎస్ ఓపెన్‌లో గ్రాండ్‌స్లామ్ డబుల్స్ ఫైనల్‌లో పాల్గొన్న అత్యంత వయోవృద్ధ ఆటగాడిగా చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. ఈ విజయం టెన్నిస్‌పై బోపన్న యొక్క శాశ్వత నిబద్ధతను నొక్కి చెబుతుంది.

ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అనిల్ జైన్ టెన్నిస్ వెటరన్ పట్ల తన అభిమానాన్ని వ్యక్తం చేస్తూ ఇలా అన్నాడు: "డేవిస్ కప్ ఒక ప్రతిష్టాత్మక టోర్నమెంట్ మరియు అనేక పురాణ క్షణాలను చూసింది. లక్నోలో జరిగిన ఈ టై మనందరికీ ఒక ముఖ్యమైన సందర్భం. AITA తరపున మరియు దేశంలోని అన్ని టెన్నిస్ ఔత్సాహికుల తరపున, మేము రోహన్ బోపన్నను అభినందిస్తున్నాము మరియు డేవిస్ కప్‌లో అతను చివరిసారిగా భారతదేశం కోసం సేవలందిస్తున్నందుకు మేము అందరం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాము. అతని అంకిత భావాన్ని మరియు యుఎస్ ఫైనల్‌లో అతను ఆడిన విధానాన్ని మేము అభినందిస్తున్నాము మరియు ఆట యొక్క స్ఫూర్తిని గౌరవిస్తాము."

బోపన్నతో పాటు, ఆరుగురు సభ్యులతో కూడిన భారత డేవిస్ కప్ జట్టులో శశికుమార్ ముకుంద్, దిగ్విజయ్ ప్రతాప్ సింగ్, యుకీ భాంబ్రీ మరియు రామ్ కుమార్ రామనాథన్‌లతో పాటు దేశంలోని అగ్రశ్రేణి సింగిల్స్ ఆటగాడు సుమిత్ నాగల్ కూడా ఉన్నారు.

"రోహన్ బోపన్న బుధవారం జట్టు శిక్షణలో చేరనున్నాడు. అతను 2002 నుండి ఇండియన్ డేవిస్ కప్‌లో భాగంగా ఉన్నాడు మరియు అతని ఉనికి జట్టుకు అమూల్యమైన అనుభవాన్ని తెస్తుంది. అనుభవం మరియు యువతను మిళితం చేసే సమతుల్య జట్టు మాకు ఉంది మరియు మా జట్టు అత్యుత్తమ ప్రదర్శన చేయగలదని మేము విశ్వసిస్తున్నాము," అని భారత డేవిస్ కప్ జట్టుకు నాన్-ప్లేయింగ్ కెప్టెన్ మరియు భారత ఒలింపిక్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు రాజ్‌పాల్ అన్నారు. స్క్వాడ్ సన్నద్ధతపై అంతర్దృష్టిని అందించినప్పుడు అసోసియేషన్ వ్యాఖ్యానించింది.

రాజ్‌పాల్‌తో పాటు ఇతర AITA అధికారులు కూడా ఉత్తరప్రదేశ్ గౌరవనీయులైన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను కలుసుకున్నారు మరియు టై యొక్క మొదటి టిక్కెట్‌తో ఆయనను సత్కరించారు, ఉత్తేజకరమైన చర్యను ప్రత్యక్షంగా వీక్షించడానికి అతన్ని ఆహ్వానించి, శుక్రవారం డ్రా వేడుకను నిర్వహించనున్నారు.

"శుక్రవారం తన అధికారిక నివాసంలో డ్రా వేడుకను స్వయంగా నిర్వహించడానికి అంగీకరించిన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కి మేము కృతజ్ఞతలు తెలువుకుంటున్నామన్నారు. భారతీయ టెన్నిస్ ఔత్సాహికులకు మరియు ముఖ్యంగా లక్నోలోని అభిమానులకు భారతీయ తారలు ప్రత్యక్షంగా ప్రత్యక్షంగా ప్రత్యక్షంగా చూడటానికి ఇది యాక్షన్-ప్యాక్డ్ వారాంతం కానుంది. ఈ కేంద్ర స్థానం ఉత్తర ప్రదేశ్ నలుమూలల నుండి టెన్నిస్ ప్రేమికులను ఆకర్షిస్తుంది. ఈ డేవిస్ కప్ టైకి ఆతిథ్యం ఇవ్వడం, టెన్నిస్ ఆటను జరుపుకోవడం మరియు రోహన్ బోపన్నకు చిరస్మరణీయమైన సెండ్‌ఆఫ్ ను అందించడంలో ప్రభుత్వం అందించిన మద్దతు కోసం మేము కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము, "అని AITA సెక్రటరీ జనరల్ అనిల్ ధూపర్ అన్నారు.

డేవిస్ కప్, 120 సంవత్సరాలకు పైగా గొప్ప చరిత్ర కలిగిన ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన మరియు అత్యంత ప్రీమియర్ అంతర్జాతీయ పురుషుల టెన్నిస్ టీమ్ పోటీ, 135 కంటే ఎక్కువ దేశాలు పాల్గొంటాయి. ఒక డేవిస్ కప్ టై ఐదు మ్యాచ్‌లను కలిగి ఉంటుంది-నాలుగు సింగిల్స్ మరియు ఒక డబుల్స్ మ్యాచ్-మరియు కనీసం మూడు మ్యాచ్‌లలో గెలుపొందిన జట్టు టైను సురక్షితం చేస్తుంది. ఇక్కడ గెలిస్తే 2024 డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్ %×% ప్లే-ఆఫ్స్‌లో భారత్ స్థానాన్ని ఖాయం చేస్తుంది. మ్యాచ్‌లు శనివారం మధ్యాహ్నం 12గంటలకు, ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయి.

# అధ్యాపకులకు సహనమే అతిపెద్ద ఆయుధం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** యువతను తీర్చిదిద్దడంలో అధ్యాపకునిని సహనమే అతిపెద్ద ఆయుధంగా నిలుస్తుందని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. మంగళవారం ఏయూ హెచ్ఆర్‌డిసి కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్రంపై పునశ్చరణ తరగతులను ఆమె ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆచార్య సమత మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న నూతన జ్ఞానాన్ని విద్యార్థులకు అందించాలని సూచించారు. సృజనాత్మకత, సహనం, కమ్యూనికేషన్ స్కిల్స్, కాల నిర్వహణ, కాలానుగుణంగా మార్పులను ఆకలింపు చేసుకోవడం వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. పర్యావరణ మార్పులు పెను సవాళ్లను వినురుతున్నాయన్నారు. ఊహించని విధంగా వరదలు రావడం, ప్రత్యామ్నాయ ఇంధనాలను అన్వేషించడం ఎంతో అవసరమన్నారు. వాయు కాలుష్యం కారణంగా లక్షలాదిమంది ప్రతీ సంవత్సరం మృత్యువాత పడటం జరుగుతోందన్నారు. అనేక పర్యావరణ సంబంధ సమస్యలకు పరిష్కారాలను చూపే దిశగా ఆచార్యులు కృషి చేయాలన్నిరు.

ఏయూ హెచ్ఆర్‌డిసి కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకట కృష్ణ మాట్లాడుతూ విభిన్న జీవులతో సమన్వయం చేసుకుంటూ సాగడం మానవ జీవన విధానమన్నారు. వైవిధ్య అంశాలు, శాస్త్రాల సమ్మేళనంగా పర్యావరణ శాస్త్రం నిలుస్తుందన్నారు. సహజ వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరరక్షణ, పర్యావరణ మార్పులపై అవగాహన, విపత్తులు, వ్యర్థాల నిర్వహణపై అవగాహన పెంచుకోవాలన్నారు. సదస్సు కన్వీనర్ ఆచార్య ఇ.ఉదయ భాస్కర రెడ్డి, ఆచార్య ఎన్.ఏ.డి పాల్ తదితరులు పాల్గొన్నారు.

# వసతి గృహాల ఆధునీకరణకు జిల్లా పరిషత్ నిధులు



**విజయనగరం:** ఉమ్మడి జిల్లాల్లోనున్న సోషల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ తదితర వసతి గృహాల లోనున్న వంట గదులు, వంట పాత్రలు విద్యార్థుల భోజనానికి అవసరమగు అన్ని సౌకర్యాలు, సామగ్రిని మార్చడానికి జిల్లా పరిషత్ నుండి నిధులను సమకూర్చునున్నట్లు జిల్లాపరిషత్ చైర్పర్స న్ మజ్జి శ్రీనివాస రావు తెలిపారు. మంగళవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 3,5,6 స్టాండింగ్ కమిటీ సమావేశాలు చైర్మన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సమావేశంలో వసతి గృహాల సామాగ్రి బాగా పాడై పోయిందని, పెరిగిన విద్యార్థుల సంఖ్యకు ప్రస్తుతం ఉన్న సామగ్రి సరిపోవడం లేదని సోషల్ వెల్ఫేర్ డి డి చైర్మన్ దృష్టికి తెచ్చారు. చైర్మన్ స్పందిస్తూ రెండు జిల్లాల్లో నున్న అన్ని వసతి గృహాలకు, మహిళా ప్రాంగణానికి, మూగ చెవిటి పిల్లల పాఠశాలకు, అవసరమగు సామాగ్రి కోసం వెంటనే ప్రతిపాదనలు పంపాలని, జెడ్ పి నిధుల నుండి లేదా సి.ఎస్.ఆర్ క్రింది కొత్త సామాగ్రి కొనుగోలుకు నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. అలాగే జిల్లా పరిషత్ లో అధికారులు, జెడ్.పి.టి.సిలను సభ్యులుగా పర్చేజ్ కమిటీను ఏర్పాటు చేసి ధరలను, నాణ్యతను తనిఖీ చేయాలనీ జెడ్ పి సి.ఈ.ఓ కు సూచించారు.

వ్యవసాయ శాఖ చర్చలో భాగంగా ఎరువుల లభ్యత పై వేపాడ జెడ్ పి టి సి మాట్లాడుతూ డి.ఎ.పి ఆర్.బి.కెలో లేదని తెలిపారు. చైర్మన్ మాట్లాడుతూ అన్ని కాంప్లెక్స్ ఎరువులు ఆర్.బి.కెలలో అందుబాటులో ఉంచాలని, ధరల నియంత్రణకు టాస్క్ ఫోర్సు కమిటీలను వేసి నిఘా పెట్టాలని వ్యవసాయ శాఖ జె.డి. కి సూచించారు. ఎరువులన్ని ఆర్.బి.కెలోని కియోస్కో ద్వారానే పంపిణీ చేయాలనీ, అప్పుడు మాత్రమే ప్రభుత్వ సబ్సిడీ వస్తుందని అన్నారు.

స్త్రీ శిశు అభివృద్ధి శాఖ చర్చ లో చైర్మన్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉండి పోయిన అంగన్వాడీ భవనాల వివరాలను అందజేస్తే వాటి నిర్మాణాలకు జిల్లా పరిషత్ నుండి నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. త్వరగా భవనాలను పూర్తి చేసి ప్రారంభించాలని తెలిపారు. మండలాల్లో జరిగే ప్రతి కార్యక్రమాలకు జెడ్.పి.టి.సిలను తప్పక ఆహ్వానించాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో ఎం.ఎల్.సి డా. సురేష్ బాబు, జిల్లా పరిషత్ సి.ఈ.ఓ రాజ్ కుమార్, స్థాయీ సంఘాల అధ్యక్షులు బాపు నాయుడు, శాంతి కుమారి, సింహాచలం, జెడ్.పి.టి.సిలు, రెండు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : T.Sirisha , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839
Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 9949413661, Simhachalam : Cell: 96660 15921, Pardwada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389,
Cheedikaada : Cell: 97686 33999, Vsp City : 8885687610, VSP : 7981904385, 8885687610, Maddilapalem : 9966708776